# ప్రజాశక్తి

బుధవారం 1 నవంబరు 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

విజయవాడలో

## బెయిల్ సంబరాలు

గుడ్లవల్లేరులో

**స్కిల్‌స్కాం కేసులో టిడిపి అధినేత చంద్రబాబుకు హైకోర్టు మంగళవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో ఆ పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశాయి. పలుచోట్ల టిడిపి నేతలు స్వీట్లు పంపిణీ చేశారు. హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ర్యాలీలు నిర్వహించారు.**

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)

### పిపిపి పద్ధతిలో గాంధీహిల్ అభివృద్ధిపై

# కౌన్సిల్‌లో రగడ

- టిడిపి ఫ్లోర్‌లీడర్‌పై దాడికి వైసిపి యత్నం
- తీవ్రంగా ఖండించిన టిడిపి, సిపిఎం
- పక్కదాని పట్టిన అజెండా అంశాలు

టిడిపి ఫ్లోర్‌లీడర్ బాలస్వామిపైకి వెళుతున్న ఎంఎల్‌సి తదితరులు

**ప్రజాశక్తి - విజయవాడ :** విఎంసి కౌన్సిల్ పరువు మంట గలిసింది. ప్రజా సమస్యలపై చర్చకు, వాటి పరిష్కారానికి వేదిక కావాల్సిన కౌన్సిల్ సమావేశం పౌరుషాలకు, పట్టింపులకు, దాడులకు, కొట్లాటకు వేదికైంది. గంటల తరబడి సాగిన ఈ ఆందోళనలు, రగడల మధ్యనే విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం సాగింది. అధికార వైసిపి నినాదాలు, అరుపులు, విపక్ష టిడిపి, సిపిఎం సభ్యుల వాకౌట్లు, బైఠాయింపులు, నిరసనల నడుమ పలు అంశాలను అధికారపక్షం ఆమోదింపజేసుకుంది. సమావేశం మధ్యలో టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామిపై అధికార వైసిపి సీనియర్ సభ్యుడు బుల్లా విజయ్‌కుమార్ దాడికి యత్నించారు. ఓ దశలో వారిద్దరి మధ్య చేయిచేయి కలిసే స్థాయికి పరిస్థితి వెళ్లింది. విజయ్‌కుమార్ తీవ్ర ఆగ్రహావేశాలతో ఊగిపోతూ తన సీట్లో నుంచి లేచి ఒక్క ఉదుటున తన మధ్యలో ఉన్న టేబుల్‌ను కూడా దాటుకొని వెళ్లి బాలస్వామిపై దాడికి యత్నించారు. ఆయనను నిలువరించే క్రమంలోనే అధికార పార్టీ ఎంఎల్‌సి ఎమ్‌డి రుహుల్లా కూడా తీవ్ర ఆగ్రహావేశాలతో, పరుష పదజాలంతో, బెదిరింపు ధోరణితో పెద్దగా కేసులు వేస్తూ ఊగిపోయారు. కౌన్సిల్‌లో ఈ చివరి నుంచి ఆ చివరి వరకు వెళ్లి టిడిపి సభ్యులకు తన చేతిని చూపుతూ హెచ్చరించారు. దీంతో పార్టీలకతీతంగా సభ్యులు విస్తుపోయారు.

మేయర్ పోడియం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు

ఈనేపథ్యంలో అధికార వైసిపికే చెందిన పలువురు సభ్యులు విజయ్‌కుమార్‌తోపాటు ఎంఎల్‌సికి సర్దిచెప్పి కూర్చోబెట్టాల్సి వచ్చింది. సుమారు గంటకుపైగా ఈ రగడ సాగింది. దీంతో ఎంతో ప్రాధాన్యత అంశాలు చర్చకు రాకుండా పక్కదారిపట్టాయి. దీనిపై టిడిపి, సిపిఎం ఫ్లోర్‌లీడర్లు బాలస్వామి, సత్యబాబు, సీనియర్ సభ్యులు జాస్తి, ముమ్మనేని ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండాలోని 118/412 అంశమైన గాంధీహిల్‌ను ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం (పిపిపి) విధానంలో అభివృద్ధి చేయాలని ఆఫీసు నుంచి పెట్టిన ప్రతిపాదనపై జరిగిన చర్చ చివరకు దాడులు చేసుకునే స్థాయికి చేరింది. గాంధీహిల్ అభివృద్ధి విఎంసి ఆధ్వర్యంలోనే జరగాలని టిడిపి, సిపిఎం సభ్యులు డిమాండ్ చేశారు. పిపిపి విధానంలో ప్రయివేటు వారికి ఇచ్చే అధికారం విఎంసికి లేదని, గాంధీఫౌండేషన్ పేరుతో ఒక కమిటీ ఉందని, అభివృద్ధి బాధ్యతనే విఎంసికి ఇచ్చారని టిడిపి సీనియర్ సభ్యులు జాస్తి వివరించారు. దీనిపై ఎంఎల్‌ఎ వెలంపల్లి శ్రీనివాసరావు జోక్యం చేసుకుంటూ టిడిపిపై విమర్శలకు పూనుకున్నాడు. విఎంసి కార్యాలయం పక్కనే ఉన్న గాంధీజీ కాంస్య విగ్రహాన్ని పుష్కరాల సమయంలో కూల్చిన ఘనత టిడిపిదేనని, ఇదేరీతిలో ఆనాడు పలు దేవాలయాలు కూల్చారని విమర్శించారు. అవినీతికి పాల్పడిన టిడిపి అధినేత జైలు పాలయ్యారని అన్నారు. గాంధీహిల్ అభివృద్ధికి పిపిపి విధానంపై వచ్చిన ప్రతిపాదనకు కమిషనర్ సమాధానం ఇస్తారని, అప్పటి వరకు ఓపిక పట్టాలని ఎంఎల్‌ఎ సూచించారు. దీనిపై కమిషనర్ సమాధానమిస్తూ ఇప్పటి వరకు గాంధీ హిల్ అభివృద్ధికి విఎంసి పరంగా రూ.2 కోట్లు వెచ్చించామని చెప్పారు. ఇంకా

(మిగతా 6లో)

### ప్రజాశక్తి వార్తకు విఎంసి స్పందన

## దసరా ఉత్సవాల ఖర్చులు చెరిసగం

### విఎంసి ప్రధాన వైద్యశాఖాధికారి వెల్లడి

**ప్రజాశక్తి - విజయవాడ :** "ఉత్సవాలు దుర్గగుడివి...ఖర్చులు విఎంసివి" శీర్షికన అక్టోబర్ 25వ తేదీన ప్రజాశక్తి ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన వార్తపై విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. ఈ వార్తపై విఎంసి ప్రధాన వైద్యశాఖాధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యాన తొమ్మిది రోజులపాటు జరిగిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లకు అయిన ఖర్చుల్లో 50 శాతం విఎంసివారు, మిగిలిన 50 శాతం దేవస్థానం వారు భరిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 25న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అన్ని శాఖల అధికారులతో జరిగిన ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయా శాఖలు చేపట్టాల్సిన ఏర్పాట్లు, పనులను నిర్దేశించారని విఎంసి ప్రధాన వైద్యశాఖాధికారి తెలిపారు. దీనిలో భాగంగా విఎంసి తరపున ఇంద్రకీలాద్రి నుండి దిగువన వినాయకుడి గుడి వరకు, అలాగే అన్ని ఘాట్లు, గుడి సమీప ప్రాంతాల్లో 24 గంటలూ పారిశుధ్య పనుల నిర్వహణ, నిర్దేశించిన చోట్ల మొబైల్ టాయిలెట్లు, తాగునీటి ఏర్పాట్లు, ఇతర పనులను అప్పగించారని పేర్కొన్నారు. ఇందుకు అయిన ఖర్చు మొత్తం కూడా దేవస్థానం వారు 50 శాతం, విఎంసి వారు వారు 50 శాతం సమానంగా ఖర్చు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. గతంలో కూడా ఇలాగే జరిగిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణకు అక్టోబర్ 14 నుండి 25వ తేదీ వరకు 12 రోజులపాటు అదనంగా 1000 మంది సిబ్బందిని ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లు పిలిచి నియమించినట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు అయిన మొత్తం ఖర్చు రూ.81.82 లక్షల్లో దేవస్థానం వాటా రూ.40.91 లక్షలు చెల్లించాలని లేఖ ద్వారా కోరినట్లు తెలిపారు. విఎంసికి ఈ మొత్తాన్ని చెల్లించేందుకు దేవస్థానం వారు చర్యలు తీసుకున్నట్లు వైద్య శాఖాధికారి ఆ ప్రకటనలో వివరించారు.

## అందని సాగునీరు... రైతు కంట కన్నీరు

- నీటి కోసం వేల రూపాయల ఖర్చు
- అప్పుల ఊబిలో కౌలు రైతులు

నెర్రలు కొట్టిన వరి చేను

**ప్రజాశక్తి-గన్నవరం:** కళ్ల ముందే సాగు చేసిన వరి పంట నీరు లేక బీటలు మారిపోవడంతో రైతు కంట కన్నీరు కారుతోంది. వేల రూపాయలు పెట్టుబడి చేతికి వస్తుందని నమ్మకం లేకుండా పోతుంది. సాగునీటి కోసం వేల రూపాయలు ఖర్చు చేయాల్సి రావడంతో కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇదీ గన్నవరం మండలంలో నెలకొన్న దుస్థితి. గత నెల రోజులుగా ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండడంతో పొలాల్లో సాగునీటి కొరత ఏర్పడింది. వర్షాలు లేవు కాలవల్లో నీరు రాకపోవడంతో నీటి కొరత వరి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. ఒక ఎకరాకు సాగునీరు పెట్టేందుకు పది వేల నుంచి 12 వేల ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఇలాగైతే అప్పుల తిప్పలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సగం మెట్ట ప్రాంతంగాను మరో సగం డెల్టా ప్రాంతంగాను ఉంది. ఈ ఏడాది తగినంత వర్షాలు లేకపోవడంతో పాటు కాలవలలో నీరు విడుదల చేయలేదు. దీంతో వరికి నీరు అందక ఎండిపోతున్నాయి. మండలంలో ఏడాది 16 వేల ఎకరాల్లో వరి సాగు అయింది. 500 ఎకరాల్లో మిర్చి, వెయ్యి ఎకరాల్లో పత్తి, వంద ఎకరాల్లో వేరుశనగ పంటలు సాగు చేశారు. తెగుళ్ల దాడితో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. రైతులు పెట్టుబడులు భరించలేక ఈసారి ఎక్కువ భాగంలో వరి వెదజల్లే విధానం పాటించారు. వరి పాలు పోసుకునే సమయంలో నీటి ఎద్దడి రావడంతో కళ్ళ ముందే పంటలు ఎండిపోవడం చూసి రైతులు

ఆయిల్ ఇంజన్‌తో నీరు పెడుతున్న రైతు

కన్నీరు కారుస్తున్నారు. ఏలూరు కాలువకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసే పరిస్థితి లేదు. దీంతో శివారు పొలాలకు నీరు లేక బెట్ట కొట్టి పంట చేతికి వస్తుందనే పరిస్థితి లేదు. ఇక మెట్ట గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. ఎకరానికి 15 వేల నుంచి 16 వేల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టారు. పంట చేతికి వస్తేనే రైతులు బ్రతికే పరిస్థితి ఉంది. పోలవరం కాల్వ ప్రక్కనే ఉన్న జలాలు వాడుకోవటంలో రాష్ట ప్రభుత్వం విఫలమైంది. వీరపనేని గూడెం, బిబి గూడెం, గొల్లనపల్లి, గోపవరపు గూడెం, చిక్కవరం, సావర గూడెం,

(మిగతా 6లో)

## హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

**ప్రజాశక్తి - గంపలగూడెం:** హత్యాయత్నం కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు. ఈ నెల 29వ తేదీన గంపలగూడెం గ్రామానికి చెందిన పఠాన్ షఫియా బేగం కిరాయి ఇంటిలో నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలో మండలంలోని పెనుగొలను గ్రామానికి చెందిన మోటాపోతుల వీరాంజనేయులు అక్రమంగా ఇంటిలోకి ప్రవేశించి తనను గాజు పెంకుతో మెడపై కోసినట్లు బాధితురాలు పఠాన్ సఫియా బేగం స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై కేసు నమోదయింది. ఈ కేసులో నిందితుడు వీరాంజనేయులును పెనుగొలనులో తన ఇంటి వద్ద మంగళవారం అరెస్టు చేసి తిరువూరు కోర్టుకు పంపినట్లు చెప్పారు. కోర్టు జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వివరించారు.

## చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్ ఆవిష్కరణ

చెకుముకి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - ఎ.కొండూరు :** చెకుముకి సైన్స్ సంబరాలు 2023 పోస్టర్‌ను కోడూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిజె ఎమ్‌డి ప్రసాద్ మంగళ వారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చెకుముకి సైన్స్ సంబరాలు శాస్త్రీయ దక్పథంతో పాటు సజనాత్మకత పెరగడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థి దశ నుండే విద్యార్థిని విద్యార్థులు చెడు అలవాట్లకు దూరం అవుతారని చెప్పారు ఈ కార్యక్రమంలో జ్ఞాన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.రామ్‌కుమార్ ప్రధాన కార్యదర్శి జి.లీల, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ

**ప్రజాశక్తి - కంచికచర్ల :** కంచికచర్ల మండలం లోని మొగులూరు గ్రామంలో ముస్లిం కాలనీ లేఔట్‌లో రూ.71 లక్షల నిధులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరా లైన్ల పనులకు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు మంగళవారం శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బండి మల్లిఖార్జున్‌రావు, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, ఎఈ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం సీసాలు స్వాధీనం

మద్యం సీసాలను చూపుతున్న సిఐ హనీష్

**ప్రజాశక్తి- నందిగామ :** తెలంగాణ నుండి ఆంధ్రకు మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హనీష్ హెచ్చరించారు. మంగళ వారం తెలంగాణ నుండి ఆంధ్రకు మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తి నుండి 150 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ నుండి నందిగామ మండలం జొన్నలగడ్డ చెక్ పోస్ట్ నుండి మద్యం తీసుకొస్తున్న మువ్వ కిరణ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎఐసిసి కార్యదర్శి క్రిస్టోఫర్‌ని కలిసిన నాగూర్

ఎఐసిసి కార్యదర్శి క్రిస్టోఫర్‌తో నాగూర్

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** ఎఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు క్రిష్టోఫర్ తిలక్‌ని పీసీసీ ప్రధాన కార్యదర్శి షేక్ నాగూర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గ తొలి సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం ఆంధ్రరత్న భవనంకు విచ్చేసిన ఏఐసీసీ కార్యదర్శి క్రిష్టోఫర్ తిలక్‌ని నాగూర్ కలిశారు.

## 15న సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయండి

జగ్గయ్యపేటలో...


పెనుగంచిప్రోలులో

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** కేంద్ర రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 15న విజయవాడలో జరిగే సిపిఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు కోటా కష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో సోమవారం సిపిఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటా కష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై 15న జరిగే సిపిఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ జాన్ సాహెబ్, డి భాస్కర్, జుజ్జువరపు వెంకట రావు, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు. **పెనుగంచిప్రోలు :** 15న ప్రజారక్షణ భేరి బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండల సిఐటియు కార్యదర్శి దారా నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశంలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. మహిళలకు 2024 నుంచే 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కోట కళ్యాణ్ మాట్లాడుతూ పలు సమస్యలపై జరిగే సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వల్లబుదాసు.గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పలుచోట్ల ఇందిరాగాంధీ వర్ధంతి

మైలవరంలో ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు

**ప్రజాశక్తి - మైలవరం :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి మంగళవారం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మహిళా ప్రధానిగా దేశాన్ని అభివద్ధి పదంలో నడిపించిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిట్టల నాగేశ్వరరావు, ఎ.దుర్గారావు, దోసపాటి గిరిధర్, కుమార్, సేలం రామకష్ణ, మసను సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** ఇందిరా గాంధీ 39వ వర్ధంతి కార్యక్రమం కాంగ్రెస్స్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్స్ కమిటీ అధ్యక్షులు బొర్రా కిరణ్ పాల్గొని కొండపల్లి స్టేషన్ సెంటర్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 39 వర్ధంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. నందిగామ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్ర పఠానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## కళ్యాణ మండపం పనులు ప్రారంభం

పనులు పరిశీలిస్తున్న సామినేని ఉదయభాను

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయిన తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని తొర్రగుంటపాలెం చిల్లకల్లు రోడ్డులో తిరుమల తిరుపతి దేవస్థానం నుండి మంజూరైన 2.5 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న టిటిడి కళ్యాణ మండపం నిర్మాణ పనులను శనివారం రాష్ట్ర ప్రభుత్వ విప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పారిశ్రామికంగా రోజురోజుకు అభివద్ధి చెందుతున్న 60 వేలకు పైగా జనాభా ఉన్న జగ్గయ్యపేట పట్టణంలో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు వివాహాలు తదితర శుభకార్యాలు చేసుకోవడానికి నేటి వరకు సరైన వేదిక లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం పట్టణంలో నూతనంగా టిటిడి కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ చెరుకుమల్లి రాంబాబు, నాయకులు చిలుకూరి శ్రీనివాస్, ఉద్దగిరి అయ్యప్ప, కాంట్రాక్టర్‌పాల్గొన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న ఎంఎల్ఎ

## 'గడపగడపకు మన ప్రభుత్వం'పై ఎంఎల్ఎ సమీక్ష

**ప్రజాశక్తి - నందిగామ :** పెద్దాపురం, దొడ్డ దేవరపాడు, జయంతి గ్రామాల్లో "గడపగడపకు –మన ప్రభుత్వం" కార్యక్రమం పూర్తవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్‌రావు మంగళవారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలు తమ దష్టికి తీసుకువచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. జగనన్న ప్రభుత్వం ప్రతి ఒక్క సచివాలయానికి కేటాయించిన గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షల నిధుల వినియోగంపై ప్రత్యేకంగా చర్చించారు .ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు .

ఘంటా విజయ్ కుమార్‌ను అభినందిస్తున్న దశ్యం

## ఘంటాకు జీవన సాఫల్య పురస్కారం

**ప్రజాశక్తి - నందిగామ :** పాత్రికేరంగంలో సుదీర్ఘ అనుభవంతో ముందుకు సాగుతున్న సీనియర్ పాత్రికేయుడు విజయ్ కుమార్ ఘంటాకు మరోసారి ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఢిల్లీకి చెందిన కైట్స్ క్రాఫ్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ విజయ్ కుమార్ చేస్తున్న సేవలు గాను జీవన సాఫల్య పురస్కారాన్ని అందించింది. ఢిల్లీ నుంచి ఆ సంస్థ పంపిణీ చేసిన అవార్డును మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం చేతుల మీదుగా విజయ్ కుమార్ అందుకున్నారు.

## చంద్రబాబుకు బెయిల్ - టిడిపి సంబరాలు

వన్‌టౌన్‌లో చిత్రపటానికి పాలాభిషేకం

నందిగామలో బైక్ ర్యాలీ, టపాసులతో సంబరాలు

**ప్రజాశక్తి - నందిగామ :** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మధ్యంతర బెయిల్ రావడంతో టిడిపి నాయకులు భారీ ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. నందిగామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ పురవీధుల్లో నందిగామ గాంధీ సెంటర్, మెయిన్ బజార్, పాత బస్టాండు, భారత టాకీస్ సెంటర్, లక్ష్మీ ప్రసన్న సెంటర్, మున్సిపల్ సెంటర్, అంబారుపేట రోడ్డు జాతీయ రహదారి వరకు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి అడుగున బాణాసంచా కాలుస్తూ సంబరాలు నిర్వహించారు. నందిగామ న్యాయవాదులు స్వీట్లు పంపిణీ చేశారు. **కంచికచర్ల :** టిడిపి జనసేన ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చారు. జై బాబు, జైజై బాబు అనే నినాదాలు చేస్తూ కంచికచర్ల –నందిగామ ప్రధాన రహదారి పై నెహ్రూ సెంటర్ లో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చుతూ ప్రదర్శన చేశారు. స్థానిక చెవిటికల్లు రోడ్డు సెంటర్ లో గల ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** స్థానిక పంచాయతీ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. **వన్‌టౌన్ :** బేగ్ నాయకత్వంలో పశ్చిమ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం వద్ద టపాసులు పేల్చి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యలయ కార్యదర్శి సారిపల్లి రాధాకష్ణ, క్లస్టర్ ఇంచార్జీలు రామయ్య, బెవర సాయి సుధాకర్, పాల్గొన్నారు. బుద్ధ వెంకన్న కార్యాలయంలో తెలుగు తమ్ముళ్లు ఆనంద కోలాహలంతో బాణాసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. నెహ్రూ బొమ్మ సెంటర్‌లో పోతిన జోగారావు ఆధ్వర్యంలో జనసేన పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోతిన వెంకట మహేష్ చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.బాణసంచాతో సంబరాలు నిర్వహించారు. **జగ్గయ్యపేట :** బంగారు కొట్ల సెంటర్ వద్ద నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం కమల సెంటర్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, టిడిపి జాతీయ కోశాధికారి, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, తదితరులు పాల్గొన్నారు. **గంపలగూడెం:** గంపలగూడెం మండల వ్యాప్తంగా టిడిపి నాయకులు సంబరాలు నిర్వహించారు. స్థానిక గాంధీ సెంటర్, తోటమూల విగ్రహాల సెంటర్లలో పెద్ద ఎత్తున టపాసులు పేల్చి, సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షుడు కాజా రవికుమార్, మండల యూత్ అధ్యక్షులు మానుకొండ రామకష్ణ పాల్గొన్నారు. **తిరువూరు :** టిడిపి నాయకులు, కార్యకర్తలు బాణాసంచాలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. **ఇబ్రహీంపట్నం :** తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం తెలుగు నాడు కాంటాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏ – కాలనీలోని యూనియన్ కార్యాలయం వద్ద కార్మికులకు మిఠాయిలు పంచి బాణాసంచా కాల్చి కార్మిక సంఘం నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకటేశ్వరావు టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి దర్శనపు స్వతంత్ర కుమార్, తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# 15న బహిరంగ సభను జయప్రదం చేయండి

## సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి నరసింహారావు

**ప్రజాశక్తి-చల్లపల్లి:** ఈ నెల 15వ తేదీన విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పిలుపునిచ్చారు. స్థానిక శ్రామిక గుంటూరు బాపనయ్య భవనంలో మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి పైర్లు ఎండిపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎన్నికల దగ్గర పడటంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో కరువు మండలాలను గుర్తించలేదన్నారు. ఇటీవల కాలంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజల్ని మభ్యపెడుతున్నారని విమర్శించారు. దళితులను ఏం ఉద్ధరించారని వైసీపీ ప్రభుత్వం సామాజిక బస్సు యాత్ర ప్రారంభించిందని ప్రశ్నించారు. మోపిదేవి మండలంలో గిరిజన మహిళపై దొంగతనం నేరం వేసి చితకబాదిన వైసిపి నాయకుడుకు బెయిల్ రావడం దారుణమన్నారు. ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ రేట్లు పెంచి పేదలపై భారం మోపారని చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం జరిగి ఉంటే నేడు పంట పొలాలు ఎండిపోయేవి కాదన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి అనుకూలమన్నారు. మహమ్మద్ కరీముల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి యద్దనపూడి మధు, మేడంకి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, బండారు కోటేశ్వరరావు, మేడేపల్లి వెంకటేశ్వరరావు, తలారి నాగేశ్వరరావు, అవనిగడ్డ సాంబయ్య, గోళ్ల సాంబశివరావు, రేపు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజా రక్షణ భేరి రాష్ట్ర జాత ఈ నెల పదో తేదీన చల్లపల్లికి రానున్న సందర్భంగా దివితాలూక అమరవీరుల స్థూపం వద్ద జరుగుతున్న పనులను వై.నరసింహారావు, యద్దనపూడి మధు, కరీముల్లా, మేడంకి వెంకటేశ్వరరావు, వాకా రామచంద్రరావు పరిశీలించారు.

## డయల్ యువర్ డిఎంకు విశేష స్పందన

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుండి ఒంటి గంట వరకు నిర్వహించిన కార్యక్రమంలో దివిసీమ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ప్రయాణికులు తమ సూచనలు సలహాలు అందజేశారు. అవనిగడ్డ నుండి ఏలూరుకు బస్ సర్వీస్ నడపాలని విజయవాడ కరకట్ట మీదగా పల్లె వెలుగు బస్ సర్వీసులు కూడా నడపాలని కోరారు. అదేవిధంగా కరకట్ట ఎక్స్ప్రెస్ ను కొడాలి మీదుగా నడపాలని కోరారు పులిగడ్డ వద్ద రిక్వెస్ట్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని నాగాయలంక నుండి రేపల్లెకు గంటకు ఒక బస్ సర్వీసు నడపాలని కోరారు. నాగా లంక నుండి అవనిగడ్డకు సెటిల్ సర్వీస్ నడపాలని కోరగా నాగాలంక నుండి మచిలీపట్నానికి మూడు సర్వీసులు మాత్రమే నడుపుతున్నారని అవి గంటకి ఒక సర్వీస్ చొప్పున నడపాలని కోరారు. నూజివీడుకు ఒక బస్ సర్వీసు నడపాలని కోరగా మొవ్వ బస్టాండ్లో బోర్డు సక్రంగా కనపడనందున ప్రయాణికులు అర్ధమయ్యే రీతిలో బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా చల్లపల్లి బస్టాండ్లో మంచినీటి సౌకర్యం లేదని దానిని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. అవనిగడ్డ నుండి కుమ్మరపాలెం బస్ సర్వీసులు పెంచాలని కోరగా ప్రయాణికుల నుండి వచ్చిన సలహాలు సూచనలపై అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామని డిపో మేనేజర్ చెప్పారు.

## అమెరికా కుట్రలను తిప్పికొట్టాలి : ఐసిఇయు

మాట్లాడుతున్న ఐసిఇయు సంయుక్త కార్యదర్శి సురేష్

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** పశ్చిమాసియాపై తన ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా మరోసారి కుట్రలు చేస్తోందని ఐసిఇయు సంయుక్త కార్యదర్శి వి.వి.కె.సురేష్ పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ ఆధ్వర్యంలో 'పాలస్తీనా సమస్య పరిష్కారాలు' అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సదస్సుకు ఐసిఇయు అధ్యక్షులు జె. సుధాకర్ అధ్యక్షత వహించగా సురేష్ మాట్లాడుతూ పశ్చిమాసియాపై తన ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా మరోసారి కుట్రలు చేస్తోందని, పైగా గాజాతో సహా మొత్తం పాలస్తీనాను కైవసం చేసుకునేలా ఇజ్రాయిల్‌ను పురిగొల్పుతోందని అన్నారు. ఇజ్రాయిల్ మిలటరీ బలగాలు గాజా ప్రాంతంలో విధ్వంసం సృష్టిస్తున్నాయని. గత 20 రోజుల్లో మహిళలు, చిన్న పిల్లలు, జర్నలిస్టులతో సహా సుమారు 9 వేల మంది పాలస్తీనా పౌరులు మరణించారని, వేల సంఖ్యలో ప్రజలు ఆసుపత్రుల పాలయ్యారన్నారు. పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గమైన, అమానుషమైన దాడులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ పాలస్తీనా ప్రజలకు సంఘీభావాన్ని ప్రకటించారు. పాలస్తీనా ప్రజల హక్కులను గౌరవించాలని, గాజా ప్రాంతంలో తక్షణమే శాంతి నెలకొనేలా చర్యలు చేపట్టాలని, ఇజ్రాయిల్ తాను ఆక్రమించుకున్న ప్రాంతాలను తిరిగి పాలస్తీనాకు ఇచ్చేసేలా అంతర్జాతీయ సమాజం తన కృషిని పెంచాలని ఆయన అన్నారు. గాజాలోని సామాన్య ప్రజలకు ఆహారం, మంచినీరు. వైద్యం వంటి ముఖ్యమైన సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిఇయు డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్, టి.చంద్రపాల్, ఎల్.రాజశేఖర్, వై.స్వామినాథ్, వి.ఆర్.ఎన్.ఠాగూర్, ఎస్.వి.రత్నారావు, బిహెచ్.మాధుర్, పి.నాగయ్య పాల్గొన్నారు.

## వరి పొలాల పరిశీలన

**ప్రజాశక్తి-ఉయ్యూరు:** నీరందక పొలాలు బీటలు వారుతున్నా ప్రభుత్వం పట్టించుకోపోవడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలవపాముల పరిధిలో సాగునీరందక బీటలు వారుతున్న వరి పొలాలను రైతులు, పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరులేక బీటలు వారుతున్న పొలాల సందర్శనకు వెళితే ఆనందంతో పలకరిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం, నాయకుల మాయమాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఈ కార్యక్రమంలో యెనిగళ్ల కుటుంబరావు, కార్యదర్శి కాటూరు శరత్, చిన్నబ్బాయి, గంపా శ్రీను, యుగ బాబు, ఆరేపల్లి శ్రీనివాసరావు, కుప్పాల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ అందించాలి

### ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామారావు

విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు

**ప్రజాశక్తి-చల్లపల్లి:** వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం చల్లపల్లిలోని విద్యుత్ శాఖ కార్యాలయం ముందు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కోతలు లేకుండా నిరంతరాయంగా తొమ్మిది గంటలు విద్యుత్ అందిస్తామని ప్రకటించారని, ఆచరణలో మాత్రం అది జరగడంలేదని విమర్శించారు. రైతులకు అందించే తొమ్మిది గంటల విద్యుత్‌ను ఏడు గంటలకు కుదించారని పేర్కొన్నారు. ప్రస్తుతం పొలాలన్నీ పొట్ట దశలో ఉన్నాయని, వ్యవసాయం కీలక దశలో ఉన్న సందర్భంలో నీళ్ల లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కాలువల్లో నీరు లేక, విద్యుత్ కోతలతో రైతులు నష్టానికి గురికావాల్సి వస్తుందన్నారు. ఏడు గంటలు ఇచ్చే విద్యుత్‌లో కూడా కోతలు విధిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కాలువల ద్వారా నీళ్ల అందించడంలో విఫలమైన ప్రభుత్వం విద్యుత్‌నైనా సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హనుమానుల ^రేంద్రనాథ్ బెనర్జీ, అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వేమూరి రత్నగిరిరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతు సంఘం నాయకులు బండి రామకృష్ణ, కొర్రపాటి ముఖర్జీ, కొల్లూరి శ్రీధర్, నక్క శ్రీనివాసరావు, డొక్కు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎంకు సత్కారం

**ప్రజాశక్తి-మోపిదేవి:** మండల పరిధిలోని కోసూరువారిపాలెం జెడ్పీ హైస్కూల్ ఇన్చార్జి హెచ్ఎం జెట్టి వీరకుమారి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయడంతో కోసూరుపాలెం గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వీరకుమారి పెరుమాళ్ళ దంపతులను మోపిదేవి ఎంఈవో 1 విద్యాసాగర్, ఎంఈవో 2 రాజకుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో విద్యాసాగర్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా పలు ప్రాంతాల్లో వీరకుమారి అందించిన సేవలను గుర్తు చేశారు. ఎంఈవో రాజ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యా ఋత్తి ఎంతో పవిత్రమైనదని తన సర్వీసులో ఎంతో మందిని ప్రయోజకులను చేయడం చెప్పరాని సంతృప్తిని ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా 38 మంది విద్యార్థులకు వీరకుమారి-పెరుమాళ్ళ దంపతులు స్కూల్ బ్యాగ్స్, నోటు పుస్తకాలు, పెన్నులు, స్కేల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోసూరు అనూష, హెచ్ఎం కొండవీటి అశోక్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బీ కనకారావు, రిటైర్డ్ ఎంఈవో రాంబ్రహ్మం, పేరెంట్ కమిటీ ఛైర్మన్ యక్కటి గిరిధర్, ఉపాధ్యాయులు సూరగం రామకృష్ణ, పద్మ, ప్రసన్న రజనీ, శ్రీదర్, గీత, రవీంద్ర, వాస్, యూటీఎఫ్ నేతలు సింహాద్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఆరోగ్య నియమాలు పాటించాలి

**ప్రజాశక్తి-పమిడిముక్కల:** అందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని, పొగాకు వాడకం వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని పమిడిముక్కల గ్రామ కార్యదర్శి కెపివి సుధాకర్ అన్నారు. మంగళవారం కపిలేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని సెంటర్లలో పొగాకు వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. పొగాకు వాడకం వల్ల నష్టాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుమలత, శివకుమారి, కృష్ణవేణి, ధరణి తదితరులు పాల్గొన్నారు.

## శివరాంప్రసాద్ పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు:** మండల టిడిపి అధ్యక్షుడు వీరపనేని శివరాం ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. పెనమకూరు, గరికపర్రు, కనకవల్లి, చాగంటిపాడు, దేవరపల్లి, గురువింద పల్లి, ఐలూరు గ్రామాల్లో వీరపనేని శివరాం పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, టిడిపి శ్రేణులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకొని ఘనంగా పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు.

## వేములమడలో గడపగడపకూ మన ప్రభుత్వం

**ప్రజాశక్తి-మొవ్వ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో రాజకీయ కుల మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. వేములమడ గ్రామంలో రెండో రోజైన మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందంజలో ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, సర్పంచ్ వేములమడ సీతారామయ్య, మాజీ సర్పంచ్ మురారి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సమ్మెట ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఖాళీ కుర్చీలతో సమావేశ మందిరం

నందిగామ మున్సిపల్ సమావేశంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి- నందిగామ :** మంగళ వారం నందిగామ మున్సిపల్ సాధారణ సమావేశం ఐదు నిమిషాల్లో ముగించారు. దీనికి కారణం ఖాళీ కుర్చీలు దర్శన మివ్వటమే. సాధారణ సమావేశం ఉదయం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. 34 అంశాలతో ప్రారంభమైన సమావేశం ఎజెండాలో రెండు అంశాలు ఆమోదించిన వెంటనే, ప్రతి పక్ష దేశం పార్టీ కౌన్సిలర్‌లు చంద్రబాబుకు మధ్యంతరం బెయిల్ మంజూరు కావడంతో సమావేశం బాయికాట్ చేసినట్లు ప్రకటించారు. జై చంద్రబాబు అంటూ నినాదాలు చేసుకుంటూ సమావేశం మందిరం నుంచి బయటకు వెళ్ళిపోయారు. అనంతరం ఒక నిమిషంలో సమావేశంలో ఎజెండాలోని 34 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ మండవ వరలక్ష్మి, కమీషనర్ జయరాం, ఎఇ పణీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్‌లో టిడ్కో గృహాల పంపిణీ

గృహాలను పరిశీలిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణ పేదలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని మౌలిక సదు పాయాలతో తీర్చిదిద్దిన టిడ్కో ఇళ్ల పంపిణీ డిసెంబర్ చివరికి అందించడం జరుగు తుందని యువ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు అన్నారు. పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో తుది దశకు చేరుకున్న టిడ్కో ఇళ్ల పనులను మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు, టిడ్కో అధికారులతో కలిసి వెంకట కృష్ణ ప్రసాద్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా లబ్ధిదారులపై భారం మోపుతూ ఎన్నికల ముందు అరకొరగా టిడ్కో ఇళ్లను చేపట్టిందన్నారు. నేడు మన జగనన్న ప్రభుత్వంలో మూడు దశల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి డిసెంబర్ నాటికి లబ్ధిదారులకు టిడ్కో ఇల్లు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, సచివాలయ కన్వీనర్ పాల్గొన్నారు.

## రేపటి నుంచి గ్రంథాలయంలో పోటీలు

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బెంజిసర్కిల్ వద్ద గల సర్వోత్తమ గ్రంథాలయం నందు పాఠశాల, కళాశాల విద్యార్థులకు పోటీలను నిర్వహించనున్నట్లు సర్వోత్తమ గ్రంథాలయ సంఘం సెక్రటరీ డాక్టర్‌రావి శారద తెలిపారు. గ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. 2వ తేదీ నుండి 4వ తేదీ వరకు చిత్రలేఖనం, కథలు చెప్పటం, పుస్తక సమీక్ష, పైకి చదవడంలతో పాటు సాహితీ క్విజ్‌లలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 2వ తేదీ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సబ్ జూనియర్లకు, 1 నుండి 4వ తరగతుల విద్యార్థులకు ఇచ్చిన కథకు బొమ్మలు వేయడం, కథలు చెప్పడంలోనూ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జూనియర్ల విభాగంలో 5, 6, 7 తరగతుల విద్యార్థులకు మేమిచ్చే పుస్తకాన్ని సమీక్షించడం, మేమిచ్చే సమాచారం పైకి చదవడంలోనూ పోటీలు ఉంటాయని తెలిపారు. 3వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సీనియర్ల విభాగంలో 8, 9 10 తరగతుల విద్యార్థులకు మేమిచ్చే సమాచారం పైకి చదవడం, మేమిచ్చే పుస్తకానికి సమీక్ష రాయడంలోనూ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 4న మధ్యాహ్నం 2 గంటలుక కళాశాల విద్యార్థులకు మేము ఇచ్చిన పుస్తకం చదివి సమీక్షించడంతో పాటు సాహితీ క్విజ్‌లలో పోటీలు ఉంటాయన్నారు. పుస్తక సమీక్షకు గంట ముందు మేము ఇచ్చే పుస్తకాన్ని చదివి అప్పటికపుడు సమీక్ష చేయాలన్నారు. పైకి చదివే అంశం కూడా మేమిచ్చే సమాచారం మాత్రమే చదవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి పోటీలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. విజయ వాడ నగరంలోని అన్ని ప్రయివేటు, మునిసిపల్, జిల్లా పరిషత్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక కళాశాల నుండి ఒక టీం మాత్రమే క్విజ్‌లో పాల్గొనాలన్నారు. వివరాలకు 7995313148 ను సంప్రదించొచ్చన్నారు.

# ఉద్యోగంలో నైపుణ్యం పెంచుకోవాలి

### జిల్లా ఉపాధి కల్పన అధికారి విక్టర్ బాబు

జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులు

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** జిల్లా ఉపాధి కల్పన శాఖ, నైపుణ్యాభివద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి కష్ణా జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు ఉద్యోగ మేళా నిర్వహించినట్లు ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు అన్నారు. మంగళవారం నాడు విజయవాడలోని ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాలలో గల ఉపాధి కల్పన కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో నైపుణ్యం పెంపొందించుకావాలని ఎంపికైన ఉద్యోగంలో మరింత నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉన్నత మార్గాలను అన్వేషించాలని కోరారు. తక్కువ వేతనాలు అని ఆలోచన చేయకుండా తొలి ఉద్యోగం జీవితానికి తొలి మెట్టుగా భావించాలని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు అనేక కంపెనీల ప్రతినిధులు పాల్గొనడం హర్షణీయమన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ప్రాంతీయ నైపుణ్యాభివద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఇటువంటి జాబ్ మేళాలు నిర్వహించి పలు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా ఉపాధి కల్పన శాఖ మరియు స్కిల్ డెవలప్మెంట్ శాఖ కషి చేస్తుందని తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్, అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్, స్విచ్ గేర్స్ ఫ్యాబ్రికేటర్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో మొత్తం 163 మంది అభ్యర్థులు హాజరుకాగా వారిలో 45 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని విక్టర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ జయ రాజు, కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# వాగ్వాదాల నడుమ రోడ్డు పనులు ప్రారంభం

తహశీల్దారుతో వాగ్వాదానికి దిగిన రైతులు

**ప్రజాశక్తి- నందిగామ :** నందిగామ వద్ద 65వ నెంబర్ నేషనల్ హైవే 'వై' జంక్షన్ వద్ద రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం మొదలయ్యాయి. జిల్లా కలెక్టర్, నేషనల్ హైవే అధికారులు ఎమ్ఎల్ఎ మొండితోక జగన్మోహనరావుఎమ్ఎల్ సి అరుణ్ కుమార్ చొరవ తీసుకోవడంతో నందిగామ తహశీల్దారు మంగళవారం పనులు ప్రారంభించటంతో నష్టపరిహారం కోసం కోర్టుకు వెళ్ళిన వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పనులు నిలిపి వేయాలని కోరారు. జాతీయరహదారిపై అపరిష్కతంగా ఉండి ఎన్నో ప్రమాదాలకు జంక్షన్ నిలయంగా మారింది. ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగి ఏండ్లు గడిచినా అప్రోచ్ రోడ్డు నిర్మాణం మొదలు కాగానే కొంతమంది వ్యక్తులు నష్టపరిహారం కోసం కోర్టును ఆశ్రయించారు. అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో హైదరాబాదు నుండి వచ్చేవాహనాలు విజయవాడనుండి వచ్చేవాహనాలు వన్ వేలో వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. రాకపోకలు ప్రమాదకరంగా సాగుతున్నాయి. పలు వాహనాలు ధ్వంసమై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ దశలో ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలు ఎన్నో జరిగాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసమై ప్రమాదాల బారిన పడి కొందరు మృతిచెందిన ఘటనలు, కొందరు గాయపడిన ఘటనలున్నాయి. దీంతో పనులు మొదలయ్యే సమయానికి ఒక ముగ్గురు వ్యక్తులు రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. నందిగామ తహశీల్దారు నరసింహారావు వారితో మాట్లాడుతూ ఎన్నో ప్రమాదాలకు కారణమవుతున్న ఈ రోడ్డు విషయమై చాలామంది విల్లింగ్ లెటర్లు ఇచ్చి నష్టపరిహారాన్ని పొంది ఉన్నారని తెలిపారు. మీరు కూడా విల్లింగ్ లెటర్లు ఇచ్చి సహకరించాలని, లేకుంటే ఆర్బిట్రేషన్‌కు వెళ్లాలని సూచించారు. ఎవరికైతే నష్టపరిహారం రాలేదో వారు డాక్యుమెంట్స్ టైటిల్ ఇస్తే వెంటనే వారికి నగదు జమ చేస్తామని తహశీల్దార్ తెలిపారు. ఈ రోడ్ నిర్మాణం మాత్రం ఆగదని స్పష్టం చేశారు. తహశీల్దారు నిర్ణయానికి నందిగామ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆర్‌టిసి డ్రైవర్‌కు పరామర్శ

డ్రైవర్‌ను పరామర్శిస్తున్న రామకృష్ణ, నాయకులు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** బెంగళూరు నుంచి విజయవాడ వస్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్ బి.ఆర్.సింగ్‌పై నెల్లూరు జిల్లా కావలిలో దుర్మార్గంగా దాడిచేసి వ్యవహరించిన తీరును సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ అన్నారు. విజయవాడ విద్యాధరపురం ఆర్టీసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ సింగ్‌ను సిపిఐ కె.రామకష్ణ, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు బృందం మంగళవారం కలిసి పరామర్శించారు. జరిగిన సంఘటన వివరాలు తెలుసుకొని, సింగ్‌కు సిపిఐ అండగా ఉంటదని, త్వరగా కోలుకోవాలని ధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో , సిపిఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు కొట్టు రమణారావు, నగర ఏఐవైఎఫ్ అధ్యక్షులు కంచర్ల భార్గవ, స్థానిక డివిజన్ సహాయ కార్యదర్శి అంజూరు సూరిబాబు, రాయన గురునాథం, పంచదారుల విశాల్, మహిళా సమైక్య నాయకులు బంక ఝాన్సీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థ స్థలాలను పరిరక్షించాలి

నిరసన తెలుపుతున్న నాయకులు

**ప్రజాశక్తి - భవానీపురం :** విజయవాడ నగరంలో ఖాళీ స్థలాలను పరిరక్షించాలని సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. 43వ డివిజన్ ఆధ్వర్యంలో ఊర్మిళానగర్ వాటర్ ట్యాంకు వద్ద నగరపాలక సంస్థ స్థలాలను పరిరక్షించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ భవానీపురం ఊర్మిళానగర్ వద్ద 75 ఎకరాలలో ఐరన్ ఏర్పాటు చేయగా మిగిలిన నాలుగు ఎకరాల ఖాళీ స్థలాన్ని ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించుకునేందుకు వదిలారని తెలిపారు. 2010 జూలై 1న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అప్పటి మేయర్ రత్నబిందు శంకుస్థాపన చేశారని తెలిపారు. రాజకీయాలకతీతంగా స్థానిక శాసనసభ్యులు కార్పొరేటర్ పూనుకొని కౌన్సిల్లో అర్బన్ హెల్త్ సెంటర్, కళ్యాణ మండపానికి తీర్మానం పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఖాళీ స్థలంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయగా మిగిలిన మూడు ఎకరాలకు ఫెన్సింగ్ వేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్, రెవిన్యూ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేసి, స్థానికులతో ఈ స్థలాన్ని పరిరక్షించు కుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, సిపిఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, స్థానికలు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ జయరాం

## అభివృద్ధి పనుల పరిశీలన

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ పట్టణ పరిధిలో 6వ వార్డులో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.జయరాం పర్యటించారు. వార్డులో జరుగుచున్న డ్రెయిన్ నిర్మాణ పనులను, రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. డ్రెయిన్‌లలో ఎప్పటికప్పుడు పూడికలను తొలగించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. దోమల నివారణకు వార్డులో జరుగుతున్న దోమల మందు పిచికారిని పరిశీలించారు. వెక్టార్ కంట్రోల్ మెదడ్స్ ప్రకారం దోమల మందు పిచికారీ చేయాలని సూచించారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ పనులను నిర్వహించి దోమలను లార్వా దశలోనే నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంటింటి తడి చెత్త, పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ యాకూబ్ అలీ, ముస్లిం చైతన్య వేదిక అధ్యక్షులు కరిముల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి విరాళాలు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఆలయం నందు ప్రతిరోజూ జరుగు నిత్య అన్నదానం పథకంనకు తిలక్ రోడ్, తిరుపతికి చెందిన లక్కకుల పరందామయ్య రూ.1,00,016 లు మరియు లక్కకుల కిషోర్ రూ.1,00,016లను ఆలయ కార్యనిర్వాహణాధికారి కెఎస్ రామారావుని మంగళవారం కలిసి దేవస్థానానికి విరాళంగా అందజేశారు. దాత కుటుబానికి అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా కార్యనిర్వాహనాధికారి శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

## రెండో రోజు హుండీ ఆదాయం రూ.3.36 కోట్లు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవాలయంలో రెండో రోజు మంగళవారం కూడా హుండీ లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా నగదు రూ.3,36,60,500లు, బంగారం: 362 గ్రాములు, వెండి: 8 కేజీల 950 గ్రాములు భక్తులు హుండీ ద్వారా సమర్పించుకున్నారు. 30వ తేదీ సోమవారం (మొదటి రోజు) హుండీ లెక్కింపులో నగదు: రూ.2,58,64,740లు, రాగా, రెండో రోజు 31వ తేదీ మంగళవారం రూ.3,36,60,500లు ఆదాయం వచ్చింది. రెండు రోజులూ మొత్తం కలిపితే నగదు: రూ.5,95,25,240 లు సమకూరింది. రెండు రోజులకు చెందిన కానుకల రూపంలో బంగారం: 729 గ్రాములు, వెండి: 17 కేజీల 695 గ్రాములను భక్తులు హుండీల ద్వారా సమర్పించుకున్నారు. హుండీ లెక్కింపును ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్. రామరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు చింకా శ్రీనివాసులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి, అధికారులు, ఎస్‌పిఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. నవంబర్ 1వ తేదీ కూడా హుండీ కౌంటింగ్ కొనసాగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

# ఓటర్ల జాబితాలో పొరపాట్లు జరిగితే చర్యలు : కలెక్టర్

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

సమగ్ర ఓటర్ల జాబితా తయారీలో ఎక్కడ పొరపాట్లు జరిగిన క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులతో కలెక్టర్ బంగ్లా నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫోటో ఓటర్లు జాబితాల సంక్షిప్త సవరణ కార్యక్రమం కలెక్టర్ సమీక్షిస్తూ డ్రాఫ్ట్ రోల్స్ క్షుణ్ణంగా పరిశీలించి జమగ్ర జాబితా తయారీకి కృషి చేయాలన్నారు. అందరూ ఎన్నికల సంఘం పరిధిలో డిప్యూటేషన్ పై పనిచేస్తున్నారని, ఎక్కడ పొరపాటు జరిగినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు. అలాగే జిల్లాలో గర్భవతులు కిషోర్ బాలికలలో పాఠశాల విద్యార్థులలో ఎనీమియా నివారణకు తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ సమీక్షిస్తూ ఎనీమియా స్క్రీనింగ్ నిరంతరం జరగాలని, ఏప ప్రాంతాల్లో ఎక్కువగా ఎనీమియా గుర్తించారు దష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం అంగన్వాడీల్లో గర్భవతులకు పిల్లలకు బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్స్, పాఠశాలలో జగనన్న గోరుముద్ద పోషకాహారం అందజేస్తున్నదని, ఎనీమియా బారిన పడకుండా చూడాలన్నారు ఎనీమియా గుర్తించిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎంలు తరగతి ఉపాధ్యాయులు ఎడాప్షన్ చేసుకొని వారు పోషకాహారం, ఐరన్ ఫోలిక్ మాత్రలు తీసుకునేలా చూడాలన్నారు.జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో 2.82 లక్షల మందికి ఓ పి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు

కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంపై జిల్లా ప్రొఫైల్ తయారు చేయాలని డి ఎం అండ్ హెచ్ వో ను ఆదేశించారు.జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం కింద కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన వారిలో గుర్తించిన సుమారు 4 వేల మందికి ఆరోగ్యశ్రీ కింద కేటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు, పి హెచ్ ఎస్ సి లలో ఆరోగ్యశ్రీ కింద ఎన్ని ప్రసవాలు జరిగాయి, ప్రైవేట్ ఆసుపత్రిలలో ఎంతమందికి ప్రసవాలు జరిగాయి, డేటా సమర్పించాలన్నారు.జగనన్నకు చెబుదాం కార్యక్రమం లో వచ్చిన పిటిషన్ల పరిష్కార చర్యలు తీసుకుని సవివరమైన ఎండార్స్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని, పరిష్కార గడువు దాటకూడదని కలెక్టర్ అన్నారు. ఒకవేళ రీఓపెన్ అయితే అందుకు కారణాలు వివరించాలని, సరైన పరిష్కారం చూపకపోతే బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. విద్యాశాఖ పరంగా రాబోయే ఎస్ఎస్సి పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులకోసం స్టడీ మెటీరియల్ విషయ నిపుణుల చేత సిద్ధం చేయించినట్లు, గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో పెంపునకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు డిఇఓ తాహెరా సుల్తానా కలెక్టర్ కు వివరించారు. నాడు నేడు క్రింద పాఠశాలల్లో మౌలిక వసతుల అభివద్ధి పనులు పురోగతి కలెక్టర్ సమీక్షించారు నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి కావాలన్నారు.వ్యవసాయ శాఖ సంబంధించి ఈక్రాప్ నమోదులో ఈ కేవైసీ ప్రక్రియ నూరు శాతం పూర్తయిందన్నారు.ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ళలో పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉంటారని, వారికి మంచి ఆహారం, కనీస అవసరాలు, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం వారానికి కనీసం ఒక సంక్షేమ హాస్టల్ విజిట్ చేయాలని వివిధ శాఖల జిల్లా అధికారులు తాసిల్దార్లకు కలెక్టర్ సూచించారు. చెక్ లిస్ట్ ప్రకారం హాస్టళ్ళలో మౌలిక వసతులు, అందులో విద్యార్థుల సౌకర్యాలపై తనిఖీ నివేదికలు సిద్ధం చేసి సమగ్ర శిక్ష పిఓకు పంపాలని తెలిపారు. పివో వాటిని క్రోడీకరించి ఏ హాస్టల్లో ఏ ఏ సౌకర్యాలు ఉన్నాయి, ఏమేమి అవసరమో కలెక్టర్కు నివేదించాలన్నారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ, గుడివాడ, తాడిగడప మున్సిపాలిటీలలో పరిశుభ్రత కోసం తీసుకున్న చర్యలు, శా నిటేషన్ చర్యలు సమీక్షించారు. రోడ్లపై పశువుల సంచారం నివారణ చర్యలు తీసుకోవాలన్నారు .గుడివాడలో టిట్కో గహాలకు తాగునీటి సరఫరా పరిస్థితిపై కలెక్టర్ ఆరా తీశారు సమస్య రాకుండా చూడాలన్నారు. డి ఆర్ ఓ, పెద్ది రోజా, సమగ్ర శిక్ష ఎ పి సి ఫణి ధూర్జటి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ జి గీతాబాయి, ఐసిడిఎస్ పిడి ఎస్ సువర్ణ, తదితరులు పాల్గొన్నారు

## ఉచిత పశువైద్యశిబిరం

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు**

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోలిమెట్ల గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు తెలిపారు. శిబిరాన్ని జిల్లా లైన్స్ వైస్ గవర్నర్ 2వి విపి ఎస్ ఆంజనేయులు ప్రారంభించారు. గుడ్లల్లేరు లయన్స్ క్లబ్ సభ్యులు వి రామకష్ణ యూఎస్ఏ, అట్లూరి శ్రీరామచంద్ర ప్రసాద్ సహకరించారు. ఈ శిబిరంలో 140 పశు వులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ వైపిసి ప్రసాద్ పోలవరపు వెంకట్రావు, పొట్లూరు రవికుమార్ చాపరాల బాలాజీ, గుత్తికొండ సుభాష్ చంద్రబోస్, పామర్తి కన్య భాస్కరరావు, చలసాని శ్రీధర్, విజయ్ బాబు పాల్గొన్నారు.

## ముగిసిన సాంకేతిక పోటీలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల రజతోత్సవ వేడుకల్లో భాగంగా సాంకేతిక పోటీల హాక్ థాన్ జాతీయస్థాయి ప్రాజెక్ట్ ఎన్విజన్ మరియు టెక్ ఇన్నోవెంట్ మంగళవారంతో ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివిఎస్ఎన్ఆర్వి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిరాకిల్ సాఫ్ట్వేర్ సిస్టమ్స్ హైదరాబాద్కు చెందిన సీనియర్ టెక్నికల్ మేనేజర్ వడ్లమాని మధు పాల్గొన్నారు. ఈ పోటీలకు దేశ నలుమూలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.కామరాజు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్సాహపరుస్తూ 20 ఇంజనీరింగ్ కళాశాల నుండి 388 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ

బహుమతి రూ.14 వేలు, ద్వితీయ బహుమతి రూ.12 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ పి కోదండ రామారావు, డాక్టర్ ఎం ఆర్ సి హెచ్ శాస్త్రి, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి రవీంద్రబాబు, ఏ ఎస్ అండ్ ఏ డాక్టర్ బి కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి'

**ప్రజాశక్తి-గన్నవరం:** శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ ఆధ్వర్యంలో నవంబర్ 18న హైదరాబాద్లో మాదిగల విశ్వరూప సభ జరగనుందని ఎంఎస్పి గన్నవరం ఇంచార్జ్ మంద వేణుబాబు తెలిపారు. విశ్వరూప సభను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ముస్తాబాద గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు దువ్వూరి కోటి, ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్, ప్రధాన కార్యదర్శి ఉయ్యూరు విజయ్, నందేటి రంగారావు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు

**ప్రజాశక్తి-గన్నవరం:** గన్నవరం పోలీస్ సబ్ డివిజన్ డిఎస్పి జయసూర్య ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దావాజీగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద నుండి సంజాన్స్, బాలికల హైస్కూల్ మీదుగా బుద్ధవరం రోడ్డులోని

ఓయూ హోటల్ వద్ద రన్ ముగిసింది. ఈ రన్లో గెలుపొందిన మొదటి ముగ్గురుకి డిఎస్పి చేతుల మీదగా బహుమతులు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు నరసింహారావు, కనకారావు, సత్య శ్రీనివాస్, పవన్ పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

రాబోయే వేసవిలో జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులతో రాబోయే వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్యను అధిగమించడానికి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే వేసవి నాటికి చెరువులను, పైపులైన్, చేతిపంపుల మరమ్మతులు పూర్తిచేయాలని చెప్పారు. సమగ్ర మంచినీటి రక్షిత పథకం, మంచినీటి రక్షిత పథకం ద్వారా తాగునీరు అందించడంలో తలెత్తే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలోని పంచాయితీ చెరువులను జిల్లా గ్రామీణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నింపే విధంగా అధికారులు ప్రణాళిక రూపొందించాలన్నారు. గతంలోని నీటి సమస్యలను దష్టిలో పెట్టుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఇప్పటినుంచే ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. గ్రామాలలో త్రాగునీటిని శుద్ధి చేసే ఫిల్టర్ బెడ్స్ ను గుర్తించి రీప్లేస్ చేయాలని, అందుకు నాణ్యమైన ఇసుకను ఉపయోగించాలని అధికారులకు సూచించారు. ఫిల్టర్ బెడ్స్ ను క్లీన్ చేయడానికి ఉపాధి హామీ కూలీలను ఉపయోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. నీటిని పంపింగ్ చేయడానికి ఉపయోగించే విద్యుత్ మోటార్లకు ప్రత్యామ్నాయంగా మరొక మోటారు కొనుగోళ్లకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.గతంలో అవనిగడ్డలోని ఒక చెరువులో మనిషి చనిపోయాడన్న కారణంగా, ఆ గ్రామ ప్రజలు చెరువు నీటిని ఉపయోగించడం మానేశారని అధికారులు కలెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. అయితే ఆ చెరువులోని నీటిని పూర్తిగా బయటకు తోడేసి చెరువును ఎండగట్టాలని, కొత్త నీరును నింపి చెరువు నీటిని ఉపయోగించుకునే విధంగా గ్రామస్తులను సంసిద్ధం చేయాలన్నారు.ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ, రమణ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో మెరిసిన శ్రీదేవి

**ప్రజాశక్తి-గన్నవరం:** సత్యసాయి సేవా సంఘం విద్యా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీన 'విద్య యొక్క అంతిమ లక్ష్యం'పై నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలో

తమ విద్యార్థిని పి.శ్రీదేవి ప్రియాంక ప్రథమ స్థానంలో నిలిచినట్లు వికెఆర్ కళాశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు 60 మంది పాల్గొనగా ఆరుగురు ప్రతిభ చూపారన్నారు. అందులో శ్రీదేవి మొదటి స్థానంలో నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందినట్లు చెప్పారు. పుట్టపర్తిలో నిర్వహించే సత్యసాయి జయంతి వేడుకల్లో తమ విద్యార్థులు బహుమతులు అందుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వెంకట్ మోటపర్తి, జివిఎల్ఎస్ఎన్ ప్రసాద్ అభినందించారు.

## చట్టాలపై అవగాహన ఉండాలి : ఎస్ఐ

**ప్రజాశక్తి-కోడూరు:** విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరు దిశ యాప్ గురించి తెలుసుకోవాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోడూరు ఎస్సై వి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం కోడూరు లోని మారుతి డిగ్రీ కళాశాల నందు విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న

నేరాల గురించి, డ్రగ్స్ మరియు చెడు వ్యసనాల వలన యువత ఏ విధంగా జీవితాలను నాశనం చేసుకుంటున్నారో తెలియజేసి, ప్రతి విద్యార్థిని విద్యార్థులు అందరూ సత్ప్రవర్తనతో ఉంటూ ఎటువంటి చెడు వ్యసనాల జోలికి వెళ్ళరాదన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ వారు చెప్పే దారిలో నడుస్తూ, అందరూ బాగా చదువుకుని మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారుతి కళాశాల ప్రిన్సిపల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన

**ప్రజాశక్తి-మోపిదేవి:** రైతులు తమకు ఉన్న నీటి వనరుల సౌలభ్యత బట్టి టమాట, బొప్పాయి, అరటి, పామాయిల్, కొబ్బరి సాగు చేయడం ద్వారా రాయితీ పొందవచ్చని అవనిగడ్డ నియోజకవర్గ ఉద్యానవనశాఖ అధికారి రమేష్ తెలిపారు. మంగళవారం కోసూరువారిపాలెం గ్రామంలో రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు విడివిడిగా గానీ ఎఫ్ఐజి గ్రూపులుగా గానీ రాయితీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద తమ వివరాలను నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోసూరు అనూష, వైసిపి నాయకులు కోసూరు శివ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గుణదల మాత ప్రార్థనలు

**ప్రజాశక్తి-గుడివాడ :** గుణదల లూర్థుమాత దేవాలయం ఏర్పడి వంద వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెల్ మాత దేవాలయంలో విచారణ గురువు గుజ్జుల మైఖేల్, సహాయగురువు జాన్హరిష్ గుణదల మాత తేరుకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో గుణదల లూర్థుమాత, మరియ తల్లి స్వరూపాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షుడు ఏలేటి విలియంజోషి, ఉపదేశకులు అంతోని, క్రీస్తురాజు, సబాష్టిన్, భాస్కర్ పాల్గొన్నారు.

## తోపుడుబండ్లు పంపిణీ

**ప్రజాశక్తి ఉయ్యూరు:** సమాజసేవలో తెలుగుయువత ముందంజలో ఉంటుందని పలువురు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. వడ్డే బసవరాజ్యం చారిటబుల్ ట్రస్టు బాధ్యుడు వడ్డే సాయిశోభన్ ఆధ్వర్యంలో ఇద్దరు

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు వీరంకి గురుమూర్తి, మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, తెలుగు రైతు నాయకుడు కాకాని శ్రీనివాసరావు మాట్లాడుతూ సాయిశోభన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఖుద్దూస్, కౌన్సిలర్లు పలియాల శ్రీనివాసరావు, పరిమి సలోమి సంతోషి, బూరెల నరేశ్, నజీర్, పడమట వెంకటేశ్వరరావు, వాసు పాల్గొన్నారు.

# చెత్త పన్ను వసూలు చేస్తున్నా అధ్వానంగా పారిశుధ్యం

**●కౌన్సిల్‌లో పార్టీలకతీతంగా సభ్యుల ఆందోళన ●త్వరలో 150 మంది కార్మికుల భర్తీ : కమిషనర్**

**ప్రజాశక్తి-విజయవాడ :** నగరంలో ఎక్కడ చూసినా పారిశుధ్యం, డ్రైన్ల నిర్వహణ అధ్వానంగా తయారైందని, కార్మికుల సంఖ్యను పెంచి వాటి మెరుగుదలకు చర్యలు తీసుకోకపోతే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని విఎంసి కౌన్సిల్ సమావేశంలో పార్టీలకతీతంగా సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. రాణిగారితోట 17వ డివిజన్‌లో సైడ్ కాల్వలు నిర్మించి చాలా ఏళ్లయిందని, మురుగునీరు ప్రవహించక, దోమలు పెరిగిపోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు తగ్గిపోయి వీధులను శుభ్రం చేయడం సాధ్యం కావడం లేదన్నారు. వెంటనే కార్మికుల సంఖ్యను పెంచాలని అధికార వైసిపి కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి కోరారు. ఇదే అంశంపై అధికార వైసిపి, టిడిపి, సిపిఎం సభ్యులు వరుసగా మాట్లాడారు. మైక్రోప్యాకెట్స్ ప్రకారం కార్మికుల సంఖ్య తక్కువగా ఉన్నందున ప్రధానంగా కొండ ప్రాంతాలు, మురికివాడలు, ఇతర ప్రాంతాల్లో కూడా పారిశుధ్య నిర్వహణలో మార్పు ఉండటం లేదన్నారు. ప్రజల వద్ద నుంచి రూ.30 నుంచి 120, ఆపైన చెత్త పన్ను, ఇతర యూజర్‌చార్జీలు పెద్దఎత్తున వసూలు చేస్తున్నా, ఆ స్థాయిల్లో వీధులు శుభ్రంగా ఉండటం లేదన్నారు. దీనికి మేయర్, కమిషనర్ సమాధానం ఇవ్వాలని సభ్యులు కోరారు. కౌన్సిల్ వచ్చిన రెండున్నరేళ్ల నుండి కార్మికులను ఎందుకు భర్తీ చేయలేదని, తాను ప్రతి కౌన్సిల్‌లో ఈ విషయమై మాట్లాడుతున్నా పట్టించుకోవడం లేదని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు అన్నారు. చెత్త పన్నును పూర్తిగా రద్దు చేయాలని టిడిపి, సిపిఎం సభ్యులు డిమాండ్ చేశారు. కార్మికుల భర్తీపై సమాధానం ఇవ్వాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్‌ను మేయర్ రాయన భాగ్యలక్ష్మి కోరారు. పెరిగిన అవసరాలు, తగ్గుతున్న కార్మికుల ఈత్యా మరో 150 మంది కార్మికులను భర్తీ చేసుకోవాల్సి ఉందని కమిషనర్ సమాధానం ఇచ్చారు. ఆర్థిక శాఖ నుండి క్లియరెన్స్ వచ్చిన వెంటనే కార్మికులను భర్తీ చేస్తామన్నారు. వన్‌టౌన్‌లోని షేక్ రాజా హాస్పిటల్‌ను 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని సత్యబాబు కోరారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న టిడ్కో గృహాలు, జెఎన్ఎన్‌యుఆర్ఎం గృహాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో ఎక్కడ బడితే అక్కడ విగ్రహాల ఏర్పాటు, వీధుల పేర్లు పెట్టుకోవడానికి వీలు లేదని, అయితే ఇటీవల కాలంలో ఈ వ్యవహారంలో ఇష్టారాజ్యంగా అజెండాలోకి కొందరు సభ్యులు ప్రతిపాదనలు తీసుకొస్తున్నారని టిడిపి సీనియర్ సభ్యులు జాస్తి సాంబశివరావు కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. విగ్రహాల ఏర్పాటుకు సుప్రీంకోర్టు సూచనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంజి రోడ్డుకు గుర్తుగా ఇదే రోడ్డుపై ఏదో ఒక చోట గాంధీజి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తాను పెట్టిన ప్రతిపాదనను వ్యతిరేకించిన అధికార వైసిపి నేతలు...దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి ప్రశ్నించారు. వివాదాలకు తావులేకుండా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించినట్లుగా మహానీయులు, ముఖ్యనేతల విగ్రహాలను నగరంలోని బిఆర్‌టిఎస్ రోడ్డులోగానీ, మరేచోటగానీ ఏర్పాటు చేస్తే బాగుటుందని జాస్తి సాంబశివరావు సూచించారు. గుణదల ప్రభుత్వ దంత వైద్యశాల ఎదురుగా సెయింట్‌జాన్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి స్కూల్ పరిధిలో ఉన్న 782.22 చదరపు గజాల విఎంసి స్థలాన్ని స్కూల్‌కు కేటాయించాలన్న వైసిపి ఫ్లోర్‌లీడర్ పెట్టిన ప్రతిపాదనపై వైసిపి ఫ్లోర్‌లీడర్, టిడిపి సభ్యుల మధ్య పెద్దఎత్తున వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఈస్థలం వ్యవహారంలో బిఎండబ్ల్యుకారును స్కూల్ వారు తనకు కొనిచ్చినట్లు, కోట్లు చేతులు మారినట్లు కావాలని మీడియాలో రాయించారని, సిగ్గు శరం టిడిపి వారికి లేదని వెంకటసత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని టిడిపి సభ్యులు పట్టుపట్టారు. విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) తన ఎంపి ల్యాడ్స్ నుంచి తన వార్డు అభివృద్ధికి ఇస్తానన్న నిధులను విఎంసి వద్దనడంలో ఆంతర్యం ఏమిటని జాస్తి ప్రశ్నించారు. దీనిపై సిఇ సమాధానమిస్తూ త్వరలోనే టెండర్ పిలిచి పనులను ప్రారంభిస్తామన్నారు.

## విఎంసి ఆస్తులను పరిరక్షించాలని ర్యాలీ

విఎంసి ప్రజా ఆస్తులను, గాంధీహిల్‌ను కాపాడుకుందాంమంటూ టిడిపి, సిపిఎం సభ్యులు మంగళవారం విఎంసి ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. కౌన్సిల్ సమావేశం ముందుగా ఈ రెండు పార్టీలకు చెందిన సభ్యులు ప్లకార్డులు చేబూని అధికార వైసిపికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కౌన్సిల్ సమావేశం హాలు వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా రెండు పార్టీల ఫ్లోర్‌లీడర్లు బాలస్వామి, సత్యబాబు మాట్లాడుతూ ప్రజల ఆస్తులను పరిరక్షించడంలో అధికార వైసిపి ఘోరంగా విఫలమైందన్నారు. ఎంతో చరిత్ర కల్గిన గాంధీహిల్‌ను పిపిపి పద్ధతిలో ప్రయివేటు వారికి ధారాదత్తం చేసేందుకు కౌన్సిల్‌లో ప్రతిపాదన తీసుకురావడం శోచనీయమన్నారు. విఎంసి విలువైన స్థలాలు, ఆస్తులను ప్రయివేటు సంస్థలకు, వ్యక్తులకు కారుచౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సభ్యులు జాస్తి సాంబశివరావు, ఉమ్మడి వెంకటేశ్వరరావు, ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషా రాణి, చెన్నుపాటి క్రాంతిశ్రీ, కేశినేని శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## గ్రాంట్లను రాబట్టడంలో అధికార పక్షం విఫలం

**నిలదీసిన సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు**

**ప్రజాశక్తి-విజయవాడ :** 'మరో ఐదు నెలల్లో ప్రభుత్వ పాలన ముగుస్తుంది. విఎంసికి రావాల్సిన రూ.122 కోట్ల గ్రాంట్లను తీసుకురావడంలో అధికార వైసిపి పాలకవర్గం, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలం అయ్యారు' అని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు తీవ్రంగా విమర్శించారు. 2019 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జూలై 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన గ్రాంట్లను ఏఏ పనులకు ఎంతెంత ఖర్చు చేశారు, ఇంకా ఎన్ని గ్రాంట్లు రావాలో తాను వేసిన ప్రశ్నకు సరైన, సమగ్రమైన సమాధానం అధికారుల నుంచి రాలేదని అన్నారు. రూ.150 కోట్ల గ్రాంట్లలో ఇప్పటికి కేవలం రూ.28 కోట్లు మాత్రమే వచ్చాయని, మిగిలిన రూ.122 కోట్లను రాబట్టేందుకు చేసిన ప్రయత్నాలను కౌన్సిల్‌కు వివరించాలని పట్టుపట్టారు. రాష్ట్రానికి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులను తెప్పించకుండా విఎంసి సాధారణ నిధుల నుండి నగరంలో పనులు చేపట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. విఎంసి షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని షాపులను సకాలంలో అద్దెలకు ఇవ్వకపోవడంతో భారీ మొత్తంలో విఎంసి రాబడి కోల్పోతోందని వైసిపి, టిడిపి, సిపిఎం ఫ్లోర్‌లీడర్లు వెంకట సత్యనారాయణ, టిడిపి, నెల్లిబండ్ల బాలస్వామి, బోయి సత్యబాబు అన్నారు. ఎన్‌టిఆర్, ఎంఎంసి కాంప్లెక్స్, విహెచ్ఆర్ కాంప్లెక్స్‌లో నేటికీ అనేక షాపులు ఖాళీగానే ఉన్నాయని గుర్తు చేశారు. షాపులను సబ్‌లీజులకిస్తూ పలువురు కోట్లు గడిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఆరు నెలల నుండి ఖాళీగా ఉన్న విఎంసి సర్వేయర్ పోస్టును ఎప్పుడు భర్తీ చేస్తారో చెప్పాలని నెలిబండ్ల బాలస్వామి డిమాండ్ చేశారు.

## ఎట్టకేలకు డ్రైనేజీ పైప్‌లైన్ మరమ్మతులకు చర్యలు

**అధికారుల ప్రయత్నం విఫలం**

**పది రోజులుగా దుర్వాసనతో టీచర్స్‌కాలనీ వాసుల ఇక్కట్లు**

**ప్రజాశక్తి - విజయవాడ :** సత్యనారాయణపురం ముత్యాలంపాడు టీచర్స్ కాలనీ ఫస్ట్‌లైన్లో పలిగిపోయిన విజయవాడ నగర పాలక సంస్థకు చెందిన డ్రైనేజీ పైప్‌లైన్‌కు మంగళవారం విఎంసి అధికారులు మరమ్మతులు చేపట్టేందుకు ప్రయత్నించారు. ఓ ఇంటి కింద భూగర్భంలో ఉన్న విఎంసి పైపల్‌లైన్ గత పది రోజుల క్రితం పగిలిపోయింది. దీంతో అప్పటి నుండి టీచర్స్ కాలనీ రెండోలైనులోని రహదారిపై మురుగునీరు పారుతోంది. ప్రజలు దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు విఎంసి అధికారులు పనులు ప్రారంభించారు. సంబంధిత ఇంటి సమీపంలో గల వారల కంపెనీ వద్ద పొక్లయినర్ సాయంతో తవ్వకం చేపట్టారు. అయితే సాయంత్రం వరకు తవ్వకం జరిపినా భూగర్భంమలోని పైప్‌లైన్ కనిపించలేదు. దీంతో అధికారులు తవ్వకం జరిపిన గోతులను మళ్లీ పొక్లయినర్ సాయంతో పూడ్చివేశారు. సుమారు 60 ఏళ్ల క్రితం వేసిన ఈ పైప్‌లైన్ ఎటు నుండి ఎటువెళుతుందో అధికారులు గుర్తించలేకపోతున్నారు. ముత్యాలంపాడు డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ నుంచి సింగ్‌నగర్ ఎస్‌టిపి ప్లాంట్ వరకు పైప్‌లైన్ ఉన్నట్లు చెబుతున్నారు. ఈ పనులను సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, స్థానిక నాయకులు నాగరాజు పరిశీలించారు.

**మొదటిపేజీ తరువాయి**

## పిపిపి పద్ధతిలో గాంధీహిల్ అభివృద్ధిపై కౌన్సిల్‌లో రగడ

అనేక రూపాల్లో దానిని అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో విఎంసి నుంచి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపడానికి ప్రతిపాదన పెట్టినట్లు చెప్పారు. రాజీవ్‌గాంధీపార్కు, ఈ-3 (పద్మావతి ఘాట్)లను ఇదే విధానంలో అభివృద్ధి చేశామని చెప్పారు. దీంతో విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంఎల్ఏ వెలంపల్లి ఊగిపోతూ 2024 ఎన్నిల తర్వాత టిడిపి ఉండదని, తెలంగాణాలో ఇప్పటికే లేదని అన్నారు. దీనిపై టిడిపి ఫ్లోర్‌లీడర్ బాలస్వామి జోక్యం చేసుకుంటూ వచ్చే ఎన్నికల్లో సీటు వస్తుందో రాదో చూసుకోవాలని వెలంపల్లినుద్దేశించి వ్యాఖ్యానించారు. వైసిపి సీనియర్ సభ్యులు బుల్లా విజయ్‌కుమార్ ఆగ్రహంతో ఊగిపోతూ తమ ఎంఎల్ఏను అనే మాత్రపోడివా అంటూ బాలస్వామిపై దాడికి ప్రయత్నించారు. అయితే టిడిపి సీనియర్ సభ్యులు ముమ్మనేని ప్రసాద్‌తోపాటు ఇతర సభ్యులు ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఎంఎల్‌సి రుహుల్లా కూడా టిడిపి వారిపైకి ఒక్క ఉదుటన లేచి కేకలు వేస్తూ వెళ్లారు. దీంతో వైసిపి సభ్యులే ఆయనను వారించారు. ఈఘటన పట్ల టిడిపి సభ్యులు భోజన విరామం సమయంలో కౌన్సిల్ హాలు బయట నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిల్ హాలులో మేయర్ పోడియం ముందు బైఠాయించారు. వైసిపి సభ్యుల తీరును సిపిఎం, టిడిపి సభ్యులు తీవ్రంగా ఖండించారు. బాల, బుల్లా మధ్య మనస్పర్థలు లేకుండా రాజీకుదర్చాలని టిడిపి సభ్యులు జాస్తి, ముమ్మనేని సూచించారు. దీంతో కౌన్సిల్ ముగిసిన తర్వాత మేయర్ తన ఛాంబర్లో బాల, బుల్లాతో చర్చించి రాజీ కుదిర్చారు. ఈ నేపథ్యంలో వివాదం సద్దుమణిగినట్లయింది.

## అందని సాగునీరు...రైతు కంట కన్నీరు...

కేసరపల్లి, బుద్ధవరం గ్రామాల్లో నీటి ఎద్దడితో పంటపొలాలు ఎండిపోతున్నాయి. మూడు సంవత్సరాలుగా మోటార్లు లేకపోవటం వల్ల రైతు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఎన్ఎస్‌పి కాలువ ద్వారా అందించే అవకాశం ఉన్న ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల రైతులకు నోటి కాడకు వచ్చిన పంటకు చేతులారా పంట ఎండిపోవడం రైతులు కన్నీరు మున్నీరుగా చెందుతున్నారు. బ్రమలింగయ్య చెరువు సప్లై చానల్ పూడిపోయి వటం వల్ల ఉమ్మడి కృష్ణాజిల్లా వర ప్రదాయని చింతపూడి ఎత్తిపోతల పథకం నిర్లక్ష్యం చేయటం వల్ల రైతులకీ నీరు అందించలేకపోతున్నారు. పొలాలకు ఆయిల్ ఇంజన్ల ద్వారా మీరు పెట్టేందుకు ఖర్చు తరిసి మోపిడుగుతుందని రైతులు చెబుతున్నారు. తడిసిన పొలమే తడుస్తుండడంతో ఎకరానికి 20 గంటల నుంచి 40 గంటల వరకు నీరు పెట్టాల్సి వస్తుంది.

## ఐద్వా, అంగన్‌వాడీ యూనియన్ నేతలపై కేసు కొట్టివేత

**ప్రజాశక్తి - విజయవాడ :** అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 2016లో జరిగిన నగరంలోని సివిల్ కోర్టుల సమీపంలోని క్యాంపు కార్యాలయం ముట్టడి ఘటనలో ఐద్వా, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలపై పోలీసులు పెట్టిన అక్రమ కేసును మంగళవారం కోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసులోని నలుగురు నేతలకు విముక్తి లభించింది. మహిళా కానిస్టేబుల్‌పై దాడి చేసినట్లు, బంగారు గొలుసు లాగేసినట్లు ఐద్వా, యూనియన్ నేతలు కాజ సరోజ, జి.ఝాన్సీ, విక్రమ లక్ష్మి, శాంతికళపై పెట్టిన కేసులో సాక్ష్యాలు లేనందున, నేరాన్ని నిరూపించనందున కొట్టివేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి ఏడేళ్ళుగా నేతలు వాయిదాలకు తిరుగుతూనే ఉన్నారు. అయితే ఈ కేసును కోర్టు కొట్టివేసింది. ఇదే ఘటనపై పోలీసులు నమోదు చేసిన మరో కేసును గతంలోనే కోర్టు కేసు కొట్టివేసింది. వీరి తరపున న్యాయవాద రమేష్ వాదించారు.

**ప్రకటన**

నల్లాని కనకదుర్గ, భర్త (లేటు) సాయి కృష్ణ, 2-32 , ట్రాన్స్ ఫార్మర్ బజార్, ముప్పాళ్ళ గ్రామం, చందర్లపాడు మండలం, ఎన్టీఆర్ జిల్లా సర్వే నెం. 353లో య.3.00 భూమి విస్తీర్ణం కలదు. పైన ఉదాహరించిన భూమి ముప్పాళ్ళ PACS నందు కర్షకమిత్రా రుణం కొరకు దరఖాస్తు చేసియున్నారు. కావున రుణం ఇచ్చుటకు ముప్పాళ్ళ PACS వారు సంసిద్ధత వ్యక్తం చేసియున్నారు. ఎవరికైనా అభ్యంతరములు ఉంటే తెలుపుకొనగలరు.
సెల్ నెం. 9701500411.

**మహారాజశ్రీ 3వ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు :: విజయవాడ**
**ఓ.ఎస్.నెం.1704/2022**

బిట్వీన్:
కె.వి. రమేష్ .... వాది
**మరియు**
అజిజుల్లా ఖాన్ .... ప్రతివాది
తండ్రి. దస్తగిరి ఖాన్, బిస్మిల్లా కాంప్లెక్స్, 3వ క్రాస్, 54-6-11/2, 4వ రోడ్డు, ప్లాటు నెం.135, ఆటోనగర్, విజయవాడ.
పై నెంబరు దావాలో వాది, ప్రతివాది మీద ప్రామిసరీ నోటు బాకీ వసూలు నిమిత్తం సదరు దావా దాఖలు చేయగా, సదరు ప్రతివాదికి దావా నోటీసు నిమిత్తం ది.19-12-2023వ తేదీకి వాయిదా వేసినారు. సదరు ప్రతివాదికి ఏమయినా ఆక్షేపణలు ఉన్నచో, పై వాయిదా రోజు పై కోర్టులో ఉదయం గం.10.30 ని.లకు హాజరై తెలుపుకోవలెను. లేనిచో పరోక్షమందు తీర్మానించబడును.
**వాయిదా తేది: 19-12-2023**
**/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///**
**పి. శేషు మోహన్**
వాది తరపున న్యాయవాది

**దస్తావేజులు పోయినవి**

చల్లపల్లి మండలం, చల్లపల్లి గ్రామానికి చెందిన అడపా కృష్ణకుమారి, భర్త : అద్దంకి నాంచారయ్యకు చెందిన దస్తావేజులు పోయినవి. సర్వే నెం. 84-2బిలో 70 ఎంట్లకు సంబంధించిన దస్తావేజులు పోయినవి. ఇటీవల చల్లపల్లి నుండి కోడూరు ఆటోలో వెళుచుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యెడల దగ్గరల్లోని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగలరు. లేదా తన ఫోన్ నెం. 9676512547 ఫోన్ చేసి చెప్పగలరు.

**ఇట్లు**
**అడపా కృష్ణకుమారి,**
**భర్త : అద్దంకి నాంచారయ్య,**
**చల్లపల్లి, చల్లపల్లి మండలం.**

**ప్రకటన**

నా క్లయింటు కృష్ణాజిల్లా, కోడూరు మండలం, కోడూరు గ్రామ కాపురస్తురాలు అయిన వేములపల్లి రాజేంద్రప్రసాద్ గారి భార్య రత్నకుమారి గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం ఈ పత్రికాముఖంగా తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు భర్తగారు అయిన వేములపల్లి రాజేంద్రప్రసాద్ తండ్రి : గోపాలరావు (రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి) గారికి త్రాగుడు, పేకాట వగైరాల దుర్వసనాలకు అలవాటు పడి మానసికంగా అనారోగ్యానికి గురయ్యారు. అందువల్ల అతని తాగుడుకు అవసరమైన పైకం ఇచ్చి వారి వద్ద ఖాళీ పేపర్లపై సంతకాలు తీసుకొని అతనికి వచ్చు పెన్షన్ పైకం మొత్తం కాజేయుట వలన నా క్లయింటు ఇల్లు గడవని పరిస్థితిలో తిండి భత్యములకు గురై దీన పరిస్థితి అనుభవించుచున్నారు. కావున నా క్లయింటు భర్త అయిన వేములపల్లి రాజేంద్రప్రసాద్ గారికి ఎట్టి తనఖాలు గాని, ఎట్టి ప్రామిసరీ నోటుకు గాని అప్పులు ఇవ్వవద్దు. అట్టి అప్పులు చెల్లనేరవు మరియు ఎట్టి అప్పులు ఇవ్వవద్దు. ఎట్టి ట్రాన్సాక్షన్ చెల్లనేరదు అని అట్టి ట్రాన్సాక్షన్ చేసిన దరిమిలా మా క్లయింటు కుటుంబ సభ్యులకు ఎట్టి సంబంధాలు లేవని ఈ ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.

అవనిగడ్డ **ఇట్లు**
31-10-2023 **ఇమ్మిడిశెట్టి సుబ్బారావు,**
**న్యాయవాది, అవనిగడ్డ.**

**IN THE COURT OF THE IInd ADDL. DISTRICT JUDGE COURT AT VIJAYAWADA**
**I.A. NO. 497/2020 IN A.S.NO. /2020**

Between:
B. Samiyelu ... Petitioner / Appellant
**AND**
B. Baby & 13 Others ... Respondents
To,
R-3: యం.జయమ్మ, భర్త. ఆంజనేయులు, వయస్సు : 50, గృహిణి, నివాసం: కేసరనేని వారిపాలెం, మద్దూరు పోస్టు, కంకిపాడు మండలం.
R-9: కొండపర్ల భువన సుందరి, భర్త. (లేటు) లక్ష్మణ రావు, వయస్సు: 79, గృహిణి, ప్లాట్ నెం.9, 2వ ఫ్లోర్, తులసి అపార్ట్‌మెంట్స్, జోజినగర్, ఆటోనగర్, విజయవాడ.
పై నెంబరు గల అన్‌నెంబర్డ్ అప్పీలు ఐ.ఏ.497/2020లో రెస్పాండెంట్స్ 3 మరియు 9 అయిన మీ అవసరార్థమై ది.17-11-2023న శ్రీ పై కోర్టులో వాయిదా అయివున్నది. కావున ఆ రోజు ఉదయం గం.10.30 ని.లకు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ పై కోర్టు ఎదుట హాజరు కావాలని కోరడమైనది.
**వాయిదా తేది: 17-11-2023**
**/// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ///**
**వై.వి. కిషోర్‌బాబు,** అడ్వకేట్, విజయవాడ
సెల్: 9848880789

# బాధిత మహిళకు ప్రజా సంఘాల పరామర్శ

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కే కొత్తపాలెం ఎస్టీ మహిళను ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. మంగళవారం అవనిగడ్డ ఏరియా వైద్యశాలకు వెళ్లి బాధిత మహిళను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అవనిగడ్డ డిఎస్‌పి మురళీధరన్‌ను కలిసి మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ బాధితులపై దాడి చేసిన నిందితుడు రాజా చందుకు కోర్టు మంజూరు చేసిన బెయిల్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులను పోలీస్ స్టేషన్లో తీవ్రంగా గాయపరిచిన మోపిదేవి ఎస్సై పేరును, సచివాలయ మహిళా సంరక్షణ అధికారి స్రవంతి పేరును కూడా ఎఫ్ఐఆర్లో చేర్చి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. బాధితులకు వెంటనే నష్టపరిహారం అందించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు కాకుండా అన్ని కులాలతో కలిసి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు బసవపూర్ణ జ్యోతి, సుజాత కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రాజేష్, ఎన్ గోపాల్, నాయకులు కె.శర్మ, మిరియాల ఆనంద్, బెనర్జీ, ఆర్ శరత్, బి రాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి పవన్‌కుమార్, నాయకులు బి ఆదిశేషు, కోపనాతి తాతయ్య తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి:** బాధిత కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు తక్షణం అందించాలని, నివాసం ఉండటానికి పునరావాసం కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఎస్టీ కమిషన్ నాయకులు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం మోపిదేవి తహసిల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి తహసిల్దార్ సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వాసుపత్రిలో బాధిత మహిళను పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

## అన్నప్రసాదం వితరణ

**ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్**

శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం 200 మందికి అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కానుమోలు శ్రీమారుతి ట్రేడర్స్ అధినేత దాత పొట్లూరి వెంకటేశ్వరరావు అన్నదాన సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, దేవాలయ చైర్మన్ నెర్సు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్, హనుమాన్ దేవాలయ మాజీ చైర్మెన్ నందిగం స్వామి పాల్గొన్నారు.

## ప్రజలంతా ఐక్యంగా మెలగాలి : ఎస్‌పి

మాట్లాడుతున్న ఎస్‌పి

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** కుల, మత, వర్గ, లింగ బేధాలు లేకుండా ప్రజలందరూ ఐకమత్యంతో మెలుగుతూ, జాతీయ సమైక్యతలో భాగస్వామ్యం కావాలని జిల్లా ఎస్పీ పి.జాషువా అన్నారు. మంగళవారం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి సెంటర్ నుండి లక్ష్మీ టాకీస్ సెంటర్ మీదుగా జిల్లా పోలీస్ కార్యాలయం వరకు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ , అడిషనల్ ఎస్పి అడ్మిన్ శ్రీహరి బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్‌విడి ప్రసాద్ శాంతి కపోతాలను గాలిలోకి ఎగరవేసి, జెండా ఊపి ఐక్యత పరుగును ప్రారంభించారు. అనంతరం ఎఆర్ పోలీస్ పెరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ దేశ అంతర్గత భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి జాతీయ ఐక్యతలో భాగ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం టూ కే రన్ లో విజేతలైన వారిని ప్రత్యేకంగా అభినందించి, బహుమతి ప్రధానం చేశారు.

# చంద్రబాబుకు బెయిల్ మంజూరుపై సంబరాలు

**ప్రజాశక్తి-గుడివాడ :** చంద్రబాబుకు బెయిల్ మంజూరు కావడంతో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు టాపాసులు కాల్చి, కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో రావి ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు పాల్గొని టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు అధ్యక్షులు డి రాంబాబు, వి మురళీ, సన్యాసిరావు, బాపయ్యచౌదరి, నాయకులు పాల్గొన్నారు. చంద్రబాబుకు బెయిల్ పట్ల సీనియర్ టిడిపి నాయకులు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి) హర్షం వ్యక్తం చేశారు. జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, వెనిగండ్ల రాము మాట్లాడుతూ చంద్రబాబుకు బెయిల్ రావటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎప్పటికైనా నిజమే గెలుస్తుందన్నారు. **గన్నవరం:** చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడం సంతోషకరమని టిడిపి గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. చంద్రబాబు అనుభవం ఈ రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. **గుడ్లవల్లేరు:** గుడ్లవల్లేరు ప్రధాన సెంటర్లో బాబు రావాలి సైకో పోవాలి అంటూ నినాదాలు చేస్తూ బాణసంచా కాల్చారు. **మచిలీపట్నం రూరల్:** స్థానిక జనసేన పార్టీ మచిలీపట్నం కార్యాలయంలో జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు మధ్యంతర బెయిల్ పై హర్షం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. **ఉయ్యూరు:** టీడీపీ, జనసేన నాయకులు స్థానిక సెంటర్లో టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జంపాన గుర్నాధరావు, జంపాన పూర్ణచంద్రరావు, అబ్దుల్ ఖుద్దూస్, కాకాని శ్రీనివాసరావు పాల్గొన్నారు. **పెదపారుపూడి:** మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్‌రాజా ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేసి టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి సుబ్బయ్య, మసీముక్కు రాంబాబు, దానబోయిన వెంకటనారాయణ, గొరిపర్తి రవికుమార్ పాల్గొన్నారు. **కలెక్టరేట్:** మాజీ ఎంపి కొనకళ్ల నారాయణరావు అయన నివాసంలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధరావు (బుల్లయ్య), రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల బోసు, హసీమ్ బేగ్, మోటమర్రి బాబా ప్రసాద్ పాల్గొన్నారు. **అవనిగడ్డ:** స్థానిక టిడిపి కార్యాలయం ఎదుట పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్‌రామ్ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ వద్ద బాణసంచా పేల్చి చంద్రబాబుకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బండే కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. **మొవ్వ:** మండల పరిధిలోని పెడసనగల్లు గ్రామ శివారు శీతువానిగూడెంలో స్వీట్లు పంపిణీ చేవారు. ఈ కార్యక్రమంలో పెదపూడి ఆనంద్, ముళ్లపూడి కృష్ణారావు,పెదపూడి వెంకటేశ్వరరావు, అయ్యంకి నాగేంద్ర రావు, మోటుపల్లి సమూయేలు, కొక్కిలిగడ్డ మనోజ్ పాల్గొన్నారు. **పమిడిముక్కల:** చంద్రబాబు విడుదల పట్ల టిడిపి మండల అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. **చల్లపల్లి:** టీడీపీ నేతలు స్థానిక ప్రధాన కూడలిలో టపాసులు పేల్చి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, మాజీ అధ్యక్షుడు నిడమానూరు దిలీప్ కుమార్, జిల్లా యువజన నాయకులు మోర్ల శివ, రావి చంద్రశేఖర్, జన్ను నాంచారయ్య, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పాల్గొన్నారు.

అవనిగడ్డలో...

గుడివాడలో...

పమిడిముక్కలలో...

ఉయ్యూరులో...

## అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు : సిఐ

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు:** పేకాట కోడిపందాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు ఎవరు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని పమిడిముక్కల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.కిషోర్ బాబు తెలిపారు. మంగళవారం పమిడిముక్కల సర్కిల్ పరిధిలోని తోట్లవల్లూరు మండలంలోపలు గ్రామాలలో పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామ శివారుల్లో జూద క్రీడలు నిర్వహించే ప్రదేశాలను పరిశీలించి,ఇంతకుముందు జూద క్రీడలలో పాల్గొని కేసుల్లో ఉన్న వ్యక్తులను పిలిచి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు వారి ఆదేశాలు పాటించకుండా హద్దు మీరితే,చట్టం దష్టిలో అందరూ సమానులేనని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, పద్ధతి మార్చుకోకపోతే రౌడీ, సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తామని,తగు కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిసై, జూదానికి అలవాటు పడి, జీవితాలను నాశనం చేసుకోవద్దు అని తెలియజేశారు.శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.పమిడిముక్కల సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు ఎవరన్నా పాల్పడుతుంటే అటువంటి వాటిని ప్రజలు చూసిన వెంటనే తమ దష్టికి తీసుకురావాలని తెలియజేశారు.. పమిడిముక్కల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం కిషోర్ బాబు ఫోన్ నంబర్. 94406 27046. తెలియజేయాలని సూచించారు

## 35 వేల పని దినాల కల్పన

**ప్రజాశక్తి-మోపిదేవి:** జాతీయ ఉపాధి హామీ పథకం కింద మోపిదేవి మండలంలో 2024-25 సంవత్సరానికి 35 వేల పది దినాలు కల్పించినట్లు ఉపాధి హామీ పథకం ఏపీఎం రవికుమార్ పేర్కొన్నారు. ఎంపిక చేసిన రెండు చెరువుల పూడిక తీయడం ద్వారా ఈ పని దినాలు కల్పించినట్లు తెలిపారు.

## కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాశక్తి-ఘంటసాల:** మాదిగల చిరకాల వాంఛ అయిన ఎస్సి వర్గీకరణ అమలు చేయాలనే డిమాండ్‌తో మంద కృష్ణమాదిగ ఈ నెల 18న చేపట్టిన సభకు మాదిగ ఉద్యోగులు హైదరాబాద్ తరలిరావాలని కోరుతూ సూరపనేనివారిపాలెం మాదిగ ఉద్యోగుల సమైక్య ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు బొకినాల కష్ణ పాల్గొని కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మాదిగల విశ్వరూప మహాసభకు నవంబర్ 18న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యఅతిథిగా హాజరవుతుండగా, రాబోయే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి మాదిగల భవిష్యత్తుకు పునాదులు కోరారు. ఎస్సి వర్గీకరణ ద్వారానే మాదిగలు మరియు మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగులు పచ్చగళ్ళ ధనుంజయ రావు, ఆశా కార్యకర్త రాచూరి సుభాషిని, అంగన్‌వాడి ఆయా చిట్టూరు రాణి, ఎన్‌ఆర్జిఎస్ కోఆర్డినేటర్ కనగాల సునీల్, ప్రైవేటు ఉద్యోగి పోలిమెట్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ వర్ధంతి

**ప్రజాశక్తి-చల్లపల్లి:** నిరంతరం పేద ప్రజల అభ్యున్నతి కోసం కషి చేసిన మహనీయురాలు ఇందిరాగాంధీ అని చల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీరు రిజ్వాన్ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ 39వ వర్ధంతి ఘనంగా మంగళవారం నిర్వహించారు. తొలుతగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరీబటావో పిలుపుతో పేదరిక నిర్మూలనకు ఇందిరాగాంధీ కషి చేశారని అన్నారు.. రాచరికలను పక్కకు త్రోసి నిరుపేదలకు పట్టం కట్టిన మహనీయురాలు ఇందిరాగాంధీ అని ఆమె సేవలు కొనియాడారు. ఇందిరమ్మ రాజ్యం రావడం కోసం ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు కషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు మునిపల్లి బుజ్జి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే జగన్ ధ్యేయం: రాజన్నదొర

**జగ్గయ్యపేట :** భారతదేశంలో మంచి ఆశయాల కోసం అభివద్దే ధ్యేయంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంచి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పిడక రాజన్న దొర అన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో నూతన గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల భవనం, డైనింగ్ హాల్‌ను రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుతో కలిసి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పిడక రాజన్న దొర మంగళవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో రాజన్న దొర మాట్లాడుతూ గిరిజన హాస్టల్‌లో అదనపు గదులు, డైనింగ్ హాల్ ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించిన ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేనప్పటికీ ఎస్సీ, ఎస్టీలకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో మేలు చేశారన్నారు. 2014-19 సంవత్సరాల మధ్య టిడిపి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివద్ధికి 12 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.20 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభానుకు అండగా ఉండి రానున్న ఎన్నికల్లో వారిని గెలిపించాలన్నారు. ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను మాట్లాడుతూ 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి జగ్గయ్యపేట నియోజకవర్గం అభివద్ధి, సంక్షేమానికి కృషి చేశానన్నారు. నియోజకవర్గంలో ఎస్టీలు 15 వేల మంది ఉన్నారని, వీరిలో 10 వేల మంది సుగాలీలు, 5 వేల మంది ఎరుకల, యానాది, బుడబుక్కల వారు ఉన్నారన్నారు. 14 కోట్ల రూపాయలతో చిల్లకల్లు, జగ్గయ్యపేట నాలుగు రోడ్ల లైను నిర్మాణం, 15 కోట్ల రూపాయలతో పెనుగంచిప్రోలు దేవాలయం అభివద్ధి పనులు, కోటి రూపాయలతో ఆర్టీసీ హైవే బస్టాండ్ నిర్మించడం చేయటం జరుగుతుందని, రానున్న కాలంలో జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైలు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి రాజన్న దొరను జగ్గయ్యపేట నియోజకవర్గానికి రూ.2 కోట్లు నిధులు ధర్మవరప్పాడు తండా, భూదవాడ, రెడ్యా నాయక్ తండా, వత్సవాయి మండలంలోని గోపినేనిపాలెం, కన్నవీడు, మాచినేనిపాలెం గ్రామాల్లోని స్మశాన వాటికలు, డ్రైనేజ్, కమ్యూనిటీ హాళ్ల కొరకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, యువ నాయకులు సామినేని వెంకట కష్ణ ప్రసాద్ బాబు, మాజీ కెడిసిసి చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఆఫీసున్నీసా, తుమ్మల ప్రభాకర్, వైఎస్ఆర్సిపి నాయకులు వేల్పుల రవికుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, వత్సవాయి జెడ్పిటిసి సభ్యురాలు దయామని, ఎంపీపీ రమాదేవి, పెనుగంచిప్రోలు జడ్పిటిసి ఉట్ల నాగమణి, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, శ్రీనివాస్ గౌడ్, భాస్కరరావు, జి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాల భవనం ప్రారంభిస్తున్న రాజన్నదొర

## కెబిఎన్‌లో డిగ్రీ నాలుగో ఏడాదికి దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** నగరంలోని కాకరపర్తి భావనారాయణ కళాశాల డిగ్రీ నాలుగో ఏడాదికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టి నాలుగో సంవత్సరం డిగ్రీ కోర్సుకు సంబంధించి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీఎస్సీ (కెమిస్ట్రీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (స్టాటిస్టిక్స్), బీఎస్సీ (ఎలక్ట్రానిక్స్), బీఎస్సీ (డేటా సైన్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం (బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్), బీకాం (హెచ్ఆర్ అండ్ మార్కెటింగ్) కోర్సులకు సంబంధించి నాలుగో ఏడాది కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత కోర్సులో మూడు సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసు కొని, అన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా కోర్సులో చేరే అర్హులైన విద్యార్థులకు సాధారణ డిగ్రీ విద్యార్థులకు అందే ప్రభుత్వ పథకాలు అందుతాయని వివరించారు. నాలుగో సంవత్సరం డిగ్రీ పూర్తి చేసిన వారికి పీజీ ఒక సంవత్సరంలో పూర్తి చేసుకునే అవకాశముంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం కళాశాల కార్యాలయంలో గానీ, ఫోన్ నెంబర్ 9182907747కు సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

## టేబుల్ టెన్నిస్‌లో హ్యాపీ వ్యాలీ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ఈ నెల 27 నుండి 29వ తేదీ వరకు డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి క్లస్టర్ - 7 టేబుల్ టెన్నిస్ పోటీలలో జిల్లాలోని డాక్టర్ కె.కె.ఆర్. హాపీ వ్యాలీ స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారని స్కూల్ ప్రిన్సిపాల్ వై.రవికుమార్ తెలిపారు. ప్రతిభ కనపరిన విద్యార్థులను మంగళవారం స్కూల్ ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవి కుమార్ మాట్లాడుతూ తమ విద్యార్థులు జి.సుస్మిత, జి.హస్మిత, కె.నిఖిత, ఎం.సృజనకీర్తి, అండర్ -19 బాలికల టీమ్ విభాగంలో పతకాలు సాధించారని తెలిపారు. బాలుర విభాగంలో పి.శంకర్, ఆర్.ధనుష్, జె.సాయికృష్ణ, కె.జీతేష్ పతకాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.

## అన్ టచబుల్ వారియర్ పుస్తకావిష్కరణ

**ప్రజాశక్తి- నందిగామ :** రచయిత తంగిరాల సోనీ లిఖించిన "అన్ టచబుల్ వారియర్" పుస్తకాన్ని ఆవిష్కరించిన శాసన మండలి సభ్యులు మొండి తోక అరుణ్ కుమార్ నందిగామ పట్టణంలోని వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళ వారం రాత్రి ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ భావ జాలం, స్ఫూర్తిపై ప్రత్యేక గ్రంధాన్ని లిఖించిన రచయిత, పుస్తక సంపాదకుడు తంగిరాల సోనీను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అరుణ్‌కుమార్

## లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు

**- కమిషనర్ డి.బాలకృష్ణ**

మాట్లాడుతున్న డి.బాలకృష్ణ

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీల లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలను అందించి, నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని కమిషనర్ డి.బాలకృష్ణ తెలిపారు. జగనన్న కాలనీ లే అవుట్ నిర్మాణ పనులు, బ్యాంక్ రుణాల మంజూరు ప్రగతిపై సమీక్షా సమావేశాన్ని మంగళవారం ఆయన నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలనీల్లో గహాల నిర్మాణాల కోసం బ్యాంకర్ల సహకారంతో ఒక్కో లబ్ధిదారునికి రూ..రెండు లక్షల చొప్పున రుణాన్ని మంజూరు చేయిస్తున్నామని తెలిపారు. రుణాల మంజూరులో తలెత్తే వివిధ సందేహాలను నివత్తి చేసి లోన్ అందేందుకు మెప్మా విభాగం పూర్తిగా సహకరించాలని సూచించారు. లోన్ ప్రక్రియ పూర్తయేవరకు లబ్ధిదారులను, బ్యాంకర్లతో అనుసంధానించి రుణాలు మంజూరయ్యేలా పర్యవేక్షించాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర వసతులను వేగవంతంగా కల్పించేందుకు అదనపు కార్మికులతో నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. వందశాతం నిర్మాణ పనులు పూర్తయిన గహాలను వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు.

### అవినీతికి వ్యతిరేకంగా...

## సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల వాక్‌థాన్

**ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్**

అవినీతికి వ్యతిరేకంగా కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయ సిబ్బంది, అధికారులు మంగళవారం ఉదయం చిత్తూరు పురవీధుల్లో 3కె రన్ వాకథాన్ నిర్వహించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం నుండి గ్రీమ్స్ పేట శాఖ వరకు 3కె రన్ వాక్‌థాన్ జరిగింది. బ్యాంకు చైర్మన్ ఎఎస్ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వాక్‌థాన్‌లో అవినీతికి వ్యతిరేకంగా ఉద్యోగుల్లో స్ఫూర్తిని నింపారు. రోజువారీ కార్యక్రమాల్లో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేనివిధంగా, ఆరోపణలు రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అవినీతిరహిత వ్యవహారం అనేది ప్రతి వ్యక్తీ నిబద్ధతతో ఆచరించాల్సిన విషయమని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ ద్వారా అవినీతికి లంచగొండితనానికి దూరంగా ఉన్నట్లయితే సమాజం మొత్తం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. 2024 మార్చి నాటికి 25వేల కోట్ల రూపాయల వ్యాపార లక్ష్యంతో బ్యాంకు నిర్విరామంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ పయనంలో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా ఉమ్మడి కృష్ణా, చిత్తూరు జిల్లాల్లోని అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ మెరుగైన బ్యాంకింగ్ సదుపాయాలను అందజేస్తున్నామన్నారు. కొత్తగా బ్యాంకు ప్రవేశపెట్టిన దీనదయాల్ బంగారు ఆభరణాల రుణ పథకం ద్వారా వెనుకబడిన తరగతుల ఖాతాదారులకు కేవలం ఆరు శాతం వడ్డీకి రుణం మంజూరు చేస్తున్నామన్నారు. బ్యాంకు విజిలెన్స్ అధికారి రమణయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమ నిర్వహణకు అనుమతులు ఇచ్చిన మున్సిపల్; పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జనరల్ మేనేజర్ ప్రభాహరన్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు

## రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలో శ్రీ విద్యా హైస్కూల్ విద్యార్థిని ఎంపిక

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ శ్రీ విద్యా హైస్కూల్ విద్యార్థిని మాజేటి వర్షిత విజయవాడ, బిషప్ అజరయ్య బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఖాదీ ఫర్ నేషన్, ఖాదీ ఫర్ ఫ్యాషన్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి వక్తత్వ పోటీల్లో వర్షిత ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శ్రీ విద్యా స్కూల్ చైర్మన్ కందుల మల్లికార్జున రావు, డైరెక్టర్ మేకల వి.యస్. రామకష్ణ ప్రసాద్, ప్రధానో పాధ్యాయిని చిన్న జోష్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు వర్షితను అభినందించారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

## మెగా రక్తదాన శిబిరం

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** తలసీమియా వ్యాధితో మత్యువుతో పోరాడుతున్న ఎంతో మంది చిన్నారుల ఆయుష్షును పెంచడం కోసం ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సి.జి.యస్.టి గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. సి.జి.యస్.టి విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ కొత్తపేటలో గల పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (స్వయం ప్రతిపత్తి) కళాశాల రోటరాక్ట్ క్లబ్, ఎన్.యస్. యస్. యూనిట్ల పర్యవేక్షణలో విజయవాడ రెడ్‌క్రాస్ సొసైటి సహకారంతో కళాశాలలోని మోక్షగుండం విశ్వేశ్వరాయ సెమినార్ హాల్లో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డా. జె. లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎ.పతంజలి శాస్త్రి, సి.జి.యస్.టి అసిస్టెంట్ కమిషనర్ వి.యస్.కె. రాయులు, రోటరాక్ట్ క్లబ్ కోర్డినేటర్ డా.పి.నరేష్, ప్రెసిటెంట్ సాకేత్, ఎన్.యస్.యస్. యూనిట్ పి.ఓ బి.శ్రీకాంత్ రెడ్డి, కో-ఆర్డినేటర్ యం. నవీన్ చేతుల మీదగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కళాశాలలోని రోటరాక్ట్ క్లబ్ సభ్యులు, యస్. యస్. యస్ యూనిట్ విద్యార్థులు సుమారు 100 మంది సభ్యులు తమ వంతు బాధ్యతగా రక్తదానం చేశారు.

## తెగులు నియంత్రణకు నూతన ఉత్పత్తి

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** అతిపెద్ద వ్యవసాయ వ్యాపారాలలో ఒకటైన గోద్రెజ్ ఆగ్రోవెట్ అధునాతన తెగులుని యంత్రణకు నూతన ఉత్పత్తులు ఆవిష్కరిం చినట్లు సంస్థ ప్రతినిధి ఎం.డి.ఈశ్వర్ తెలిపారు. నగరంలోని ఓహోటల్‌లో నూతన ఉత్పత్తులను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పుష్పించే దశలో మిరప పంటను రక్షించడానికి రషీన్‌బన్ పేరుతో నూతన ఆవిష్కరణ తీసుకువచ్చినట్లు తెలిపారు. మిరపలో కనిపించే విస్తృత శ్రేణి తెగుళ్లను ఒకే దెబ్బలో నాశనం చేయడం ద్వారా తెలుగుళ్లలో సమర్థవంతంగా పనిచేసు గుణం ఉంటుందని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.